13 సెప్టెంబరు 2026

# కథానిధి

# ఆదివారం కథలు

సమర్పణ:

కె.ఎ. మునిసురేష్ పిళ్లై, 99594 88088


## కథాక్రమం

మీకు నచ్చిన కథ ఉన్న వరుస మీద క్లిక్ చేయండి. నేరుగా ఆ కథ ఉన్న పేజీలోకి వెళ్లండి


| | | | |
|---|---|---|---|
| తెలుగుప్రభ | చివరిమనిషి | బొల్లోజు బాబా | 98493 20443 |
| ఈనాడు ఆదివారం | సిక్స్ ప్యాక్ గణేశుడు | జీవీ రమేష్ | 70323 31155 |
| ప్రజాశక్తి స్నేహ | బందీ | కూచి రామాంజనేయులు | 95818 53636 |
| విశాలాంధ్ర | ఫాదర్ మిలన్ (అను.) గయే దె మోపాస | కె.ఉషారాణి | 94928 79210 |
| ప్రజాశక్తి స్నేహ | నిశ్శబ్ద త్యాగం | కత్తిమండ ప్రతాప్ కుమార్ | 90003 43095 |
| సూర్య | యుగళం | ? | |
| 30.8.26 కథానిధి సమీక్ష | సామాజిక సంక్షోభాలకు సజీవ దర్పణం | భూక్యా గోపినాయక్ | 99891 59196 |


మరికొన్ని బాలల కథలు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కథా ప్రియులకు నమస్తే..

అందరికీ వినాయకచవితి శుభాకాంక్షలు.

చాలా దినపత్రికలు ఈ ఆదివారం.. వినాయక చవితి ప్రత్యేక సంచికలను వెలువరించాయి. అందువల్ల ఈ వారం కథానిధి కొంచెం పలచబడింది.

ఈ ఆదివారం (13 సెప్టెంబరు 2026) కథల సంకలనం 43 పేజీల కథానిధి పీడీఎఫ్ లో మొత్తం 6 కథలు, అదనంగా మరికొన్ని పిల్లల కథలు ఉన్నాయి. సావకాశంగా చదవండి.. రచయితలకు మీ అభిప్రాయాలు తెలియజేయండి.

**కథానిధి పాఠకులకోసం ఒక కొత్త సదుపాయం అందిస్తున్నాను. మొదటి పేజీలో కథల వరుసక్రమం, రచయిత, ప్రచురణల వివరాలు ఉంటాయి. అందులో మీకు నచ్చిన కథ ఉండే వరుస మీద క్లిక్ చేస్తే.. పీడీఎఫ్ సంకలనంలో నేరుగా ఆ పేజీ కి వెళ్లిపోవచ్చు. ఈ సదుపాయాన్ని కథాప్రియులు వాడుకోగలరు**

కథానిధి పాఠకులకు గతవారం కథల సమీక్షను కూడా అందిస్తున్నాము.

'6 సెప్టెంబరు 2026 కథానిధి' కథలపై భూక్యా గోపి నాయక్ సమగ్ర సమీక్ష కోసం

ఈ కింది లింక్ లను క్లిక్ చేయండి

**adarsini.com వెబ్ సైట్లో చదవడం కోసం**

**యూట్యూబ్ లో వినడం కోసం**

**6 సెప్టెంబరు 2026 కథానిధి సంకలనం పీడీఎఫ్ కోసం**

కథానిధి వాట్సాప్ గ్రూపులో మీరు నేరుగా మీ మిత్రులను చేర్చవచ్చు. మీరు జాయినింగ్ లింక్ పంపితే వారు కూడా నేరుగా చేరవచ్చు.

మీ

కె.ఎ. మునిసురేష్ పిళ్లె

99594 88088

- కథలు చదవండి.
- చదివే ఆసక్తి ఉన్న మిత్రులకు ఈ పీడీఎఫ్ షేర్ చేయండి.
- కథలు నచ్చితే రచయితలకు మీ స్పందనలు తెలియ జేయండి. మెసేజీ అయినా పెట్టండి.
- కథలు చదివి వదిలే యకండి. మంచి కథల గురించి మీ మిత్రులతో కూడా ముచ్చటించండి. వారికి కూడా చదివే ఆసక్తి పుట్టవచ్చు.
- సాహిత్యప్రియులు **https://kathavasudha.com** లింక్ లోకి వెళ్లిగానీ, దిగువ పేజీలో ఇస్తున్న QR code ను స్కాన్ చేయడం ద్వారా గానీ కథావసుధ వెబ్ మేగజైన్ లోని అనువాద కథలు, అనువాద కవితలు, సాహిత్యవ్యాసాలను చదవండి.
- ఆయా దినపత్రికల సౌజన్యంతో



ఫ్రెంచి యానాం కథలు

# చివరి మనిషి

• బొల్లోజు బాబా

## యానాం - 1848

యానాం చర్చికి ఫాదర్ గా డ్యూపాంట్ వచ్చినప్పుడు, ఈ చిన్న ఫ్రెంచ్ కాలనీ అతనికి కొత్త ప్రపంచంలా అనిపించింది. సముద్రం వైపు సాగే గోదావరి పాయలు, వాటి ఒడ్డున పడవల రాకపోకలు, రేవు దగ్గర సరుకుల బస్తాలు మోసే కూలీలు, పడవల నుంచి సరుకులు కొనే వ్యాపారులు, బజారులో తిరిగే ప్రజలు, తెల్లటి దుస్తుల్లో కార్యాలయాలకు వెళ్లే ఫ్రెంచ్ అధికారులు——వీళ్లందరి కదలికలతో యానాం ఉదయం మొదలయ్యేది. ఫ్రెంచ్ అధికారుల కార్యాలయం దగ్గరికి వెళ్లే వీధిలో తెల్లటి గోడల మీద ఉదయపు వెలుగు పడేది. చర్చిగంట మోగేది. దాని శబ్దం రేవు దాకా వినిపించేది. అయితే ఆ సందడిని గమనిస్తూ ఉండగానే డ్యూపాంట్‌కు యానాంలో ఒక తీవ్రమైన లోటు కనిపించింది. కొంతకాలం క్రితం ఇక్కడి వైద్యుడు పిథోయిస్ మరణించాడు; ఆయన తర్వాత మరొక వైద్యుడు రాలేదు. జనసందడి ఉన్న పట్టణానికి సరైన వైద్య సదుపాయం లేదు. సాధారణ జ్వరం, గాయాలు, చిన్న చిన్న అనారోగ్యాలకు ప్రజలు ఇంటి చిట్కాలనే ఆశ్రయించేవారు. తీవ్రమైన జబ్బు వస్తే దేవుడిపై నమ్మకమే వారికి చివరి ఆధారం.

డ్యూపాంట్ వైద్యుడు కాదు. అయినప్పటికీ వైద్యుడి కొరతను చూసి ఊరుకోలేకపోయాడు. తనకు తెలిసిన కొంతమంది ఫ్రెంచి వైద్యుల వద్ద ప్రాథమిక వైద్యపద్ధతులు నేర్చుకున్నాడు. జ్వరం వచ్చినవారిని ఎలా



బొల్లోజు బాబా ఆధునిక తెలుగు సాహిత్యంపై తనదైన ముద్ర వేసిన రచయిత. కవిత్వంలో మానవీయ స్పందన, సామాజిక చైతన్యం, ప్రకృతి పట్ల సున్నితమైన దృష్టి ఆయన ప్రత్యేకతలు. ఆకుపచ్చని తడిగీతం, వెలుతురు తెర, మూడో కన్నీటి చుక్క కవితా సంపుటాలతో పాటు ప్రపంచ కవిత్వాన్ని తెలుగులోకి అనువదించారు. స్వేచ్ఛా విహంగాలు, థేరీ గాథలు, ప్రాచీన గాథలు ఆయన అనువాద ప్రతిభకు నిదర్శనాలు. కవిత్వ భాష వంటి సాహిత్య వ్యాస రచనలు ఆయన విమర్శనాత్మక దృష్టిని ప్రతిబింబిస్తాయి. చరిత్ర, సంస్కృతి, సామాజిక పరిణామాలపై కూడా విస్తృతంగా రచనలు చేశారు. ఆయన సాహిత్య కృషికి పలు పురస్కారాలు లభించాయి. కాకినాడ, పి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా ఉద్యోగం చేస్తున్నారు.

✆ 9849320443

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

చూసుకోవాలి, గాయాలను ఎలా శుభ్రం చేయాలి, నీరసించిన రోగికి నీళ్లు ఎలా అందించాలి, ఎలాంటి పరిస్థితుల్లో రోగిని ఒంటరిగా వదలకూడదు వంటి విషయాలను తనకు సాధ్యమైనంత వరకు తెలుసుకున్నాడు. పెద్దగా వైద్య విద్య నేర్చుకున్నవాడు కాకపోయినా, యానాంలో వైద్యుడే లేని పరిస్థితిలో తనకు తెలిసిన కొద్దిపాటి జ్ఞానాన్ని ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని నిర్ణయించుకున్నాడు.

అతని ఆస్తి అంతా కొన్ని ప్రార్థనా పుస్తకాలు, ఒక చిన్న సిలువ, కొద్దిపాటి బట్టలు, ఇత్తడి మరచెంబు, చిన్న తోలుసంచిలో ఏవో కొన్ని పొడులు, ద్రవాలు అంతే. ఎవరైనా అనారోగ్యంతో తనను ఆశ్రయిస్తే, అది తన మతపరమైన బాధ్యత మాత్రమే కాదని, ఒక మనిషిగా తనకు ఉన్న బాధ్యత కూడా అని భావించి వారికి చేతనైనంత సేవ చేసేవాడు.

జబ్బుపడినవాళ్లు అతని దగ్గరకు రావడం మొదలు పెట్టారు.

ఒకసారి జ్వరం వచ్చిన బాలుడిని చూస్తూ రాత్రంతా అతని దగ్గరే కూర్చున్నాడు. మరోసారి గాయపడిన పడవ కార్మికుడి గాయాన్ని శుభ్రం చేశాడు. ఒక వృద్ధురాలికి మందు ఎలా వాడాలో చెప్పాడు.

ఆ సేవలు పెద్దగా కనిపించేవి కావు.

యానాంలో వైద్యుడు లేని రోజుల్లో అవి చిన్న విషయాలు కూడా కావు. అలా రెండేళ్లు గడిచాయి. 1848 వేసవిలో ఒకరోజు రేవు దగ్గర పనిచేసే ఒక కూలీకి అకస్మాత్తుగా తీవ్రమైన వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. ఉదయానికి పనికి వెళ్లిన మనిషి సాయంత్రానికి మంచం మీద కదలలేని స్థితిలో పడ్డాడు. అతని శరీరం నుంచి నీరు మొత్తం బయటకు వెళ్లిపోయి నట్టుగా కళ్ల గుంటలు లోపలికి పోయాయి, పెదవులు ఎండిపోయాయి, చేతులు చల్లబడిపోయాయి.

రాత్రికి అతని భార్య పరుగెత్తుకుంటూ డ్యూపాంట్ దగ్గరకు వచ్చింది.

"ఫాదర్… మా ఆయనకు ఏదో అయింది."

అతను వెంటనే వెళ్లి, తనకు తెలిసినంతవరకు రోగిని చూసి, కొద్దికొద్దిగా నీళ్లు అందించాడు.

అతని భార్య భయంతో ఏడుస్తోంది. "ఏమైంది ఫాదర్?"

డ్యూపాంట్ సమాధానం చెప్పలేదు. అతనికీ పూర్తిగా తెలియదు.

మరుసటి ఉదయం ఆ మనిషి చనిపోయాడు.

మరుసటి రోజు మరో ఇంట్లో అదే లక్షణాలు కనిపించాయి. రెండో రోజు మరొక ఇంట్లో. మూడో రోజు ఇంకో ఇంట్లో.

వారం తిరిగే సరికి ఆ వ్యాధికి ఒక పేరు వచ్చింది — కలరా. ఆ పేరు యానాం మీద పడిన పిడుగులా మారింది.

వెంటనే పట్టణం ముఖం మారిపోయింది.

మొదట తలుపులు మూసుకున్నాయి. తర్వాత వీధులు ఖాళీ అయ్యాయి. తర్వాత బజార్లు. పిల్లలను బయటికి రానివ్వలేదు.

రేవులో పని చేసే వాళ్లు పడవల దగ్గరకు వెళ్లడం తగ్గించారు. ఒక ఇంట్లో జబ్బు ఉందని తెలిస్తే పక్కింటివాళ్లు తలుపులు మూసుకునేవారు.

మధ్యాహ్నం వేళల్లో కూడా వీధులు ఖాళీగా కనిపించేవి. రాత్రి మరింత భయంకరంగా ఉండేది. గాలిలో శవాలు కాలిన వాసన ఎక్కడ చూసినా. యానాం మీద ఒక భయంకరమైన నిశ్శబ్దం పరుచుకుంది.

ఆ నిశ్శబ్దాన్ని అప్పుడప్పుడు ఏదో ఒక ఇంటి నుంచి వినిపించే ఏడుపు చీల్చేది. ఒక ఇంట్లో భర్తను కోల్పోయిన భార్య ఏడుస్తుంటే, మరో ఇంట్లో తల్లిని కోల్పోయిన పిల్లలు విలపించేవారు. కొన్నిసార్లు కొన్ని ఇళ్ల నుంచి ఏ శబ్దమూ వినిపించేది కాదు. అదే మరింత భయంకరం. ఎందుకంటే అక్కడ ఉన్నవాళ్లందరినీ కలరా తీసుకుపోయి ఉండవచ్చు. అలాంటి ఇంటి తలుపు తట్టడానికి కూడా ఎవరూ సాహసించేవారు కాదు. లోపల మనుషులు బతికున్నారో లేక శవాలే ఉన్నాయో తెలుసుకోవడానికి కూడా ధైర్యం సరిపోయేది కాదు.

ఒక ఉదయం డ్యూపాంట్ చర్చి నుంచి బయటికి వచ్చేసరికి అతని చేతిలో ఒక చిన్న సంచి ఉంది. అందులో తనకు అందుబాటులో ఉన్న రెండు శుభ్రమైన బట్టలు, ఒక చిన్న సీసా, నీళ్ల మరచెంబు ఉన్నాయి. చర్చి ముందు నిలబడి ఉన్న వృద్ధుడు అతన్ని చూసి, "ఎక్కడికి ఫాదర్?" అని అడిగాడు. "కురసాంపేటకు," అన్నాడు డ్యూపాంట్. వృద్ధుడు వెంటనే అతని చేతిని పట్టుకుని, "అక్కడికి వెళ్లకండి. కలరా ఉంది," అన్నాడు. "తెలుసు,"

"అక్కడికి వెళ్లినవాళ్లు తిరిగి రావడం లేదు." డ్యూపాంట్ కొద్దిసేపు అతని ముఖంలోకి చూసి, "అందుకే వెళ్లాలి," అన్నాడు.

"మీరు డాక్టర్ కాదు కదా? మీ దగ్గర మందులు కూడా పెద్దగా లేవు." డ్యూపాంట్ కాసేపు మౌనంగా ఉండి,

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

"అందరికీ సరిపోకపోవచ్చు. మందు ఇవ్వలేకపోయినా నీళ్లు ఇవ్వగలను. అదీ చేయలేకపోతే కనీసం వాళ్ల పక్కన కూర్చోగలను," అన్నాడు. వృద్ధుడు ఇంకేమీ మాట్లాడలేదు. డ్యూపాంట్ కురసాంపేట వైపు నడిచాడు.

కురసాంపేటలో మొదటి ఇల్లు. చిన్నదే. ముందర మట్టి అరుగు, పక్కన ఎండిపోయిన కొబ్బరి ఆకుల కుప్ప, తలుపు దగ్గర నీళ్ల కుండ. ఇంటి చుట్టూ వెదురు తడికలతో చేసిన కంచె. ఎవరూ కనిపించలేదు. డ్యూపాంట్ తలుపు తట్టాడు. లోపల నుంచి సమాధానం రాలేదు. మళ్లీ తట్టాడు. కొద్దిసేపటి తర్వాత చాలా బలహీనంగా ఒక మగ గొంతు వినిపించింది. "వెళ్లిపోండి."

డ్యూపాంట్ తలుపు దగ్గరే నిలబడి, "నేను డ్యూపాంట్,".

లోపల నుంచి, "నాకు కలరా ఉంది. మీకు అంటుకుంటుంది. వెళ్లిపోండి," అని సమాధానం వచ్చింది. డ్యూపాంట్ తలుపు తెరవమని బలవంతం చేయలేదు. "అయితే నేను బయటే ఉంటాను. మీకు నీళ్లు కావాలంటే చెప్పండి," అన్నాడు. కొద్దిసేపటికి తలుపు కొద్దిగా తెరుచుకుంది. లోపల నేలమీద ఒక వృద్ధుడు పడి ఉన్నాడు. అతని శరీరం నీరసంగా ఉంది. ముఖం మీద చెమట లేదు. పెదవులు ఎండిపోయి తెల్లగా మారాయి. కళ్ల గుంటలు లోపలికి వెళ్లిపోయాయి. పక్కనే అతని భార్య గోడకు ఆనుకుని నిలుచుని ఉంది. ఆమె కూడా రెండు రోజులుగా సరిగా తినలేదని స్పష్టంగా కనిపిస్తోంది.

డ్యూపాంట్ ముందుగా రోగి దగ్గర కూర్చుని అతని నాడిని చూడటానికి ప్రయత్నించాడు. అతని చేతి వేళ్లు చల్లగా ఉన్నాయి. "నీళ్లు," అని ఆ వృద్ధుడు నెమ్మదిగా అన్నాడు. డ్యూపాంట్ పాత్ర తీసుకుని ఒకేసారి ఎక్కువగా ఇవ్వకుండా కొద్దికొద్దిగా తాగించాడు. వృద్ధుడు రెండు గుక్కలు తాగగానే మళ్లీ వాంతి చేసుకున్నాడు. అతని భార్య భయంతో చేతులు తలపై పెట్టుకుంది. "బతుకుతాడా ఫాదర్," అంది. డ్యూపాంట్ ఆమెను చూశాడు. అతని దగ్గర ఆ ప్రశ్నకు సమాధానం లేదు.

"ఇప్పుడాయనకు కావాల్సింది నీళ్లు. మీరు భయపడకుండా దగ్గరగా ఉండండి," అంటూ తన దగ్గరున్న మందు కొద్దిగా ఇచ్చి, తడి బట్టతో రోగి ముఖం తుడిచాడు.



**ఆ రోజు నుంచి డ్యూపాంట్ ఒక్కడే తిరగటం కాకుండా అతనితో మరి కొందరు రావడం మొదలుపెట్టారు. మొదట ముత్తయ్య. తర్వాత మాలపేట నుంచి ఇద్దరు యువకులు. డ్యూపాంట్ ముందుగా నడుస్తుంటే ధైర్యం తెచ్చుకొని వెనుక నడిచేవారు. ఒకడు నీళ్లు మోసేవాడు. మరొకడు డ్యూపాంట్ తోలుసంచి పట్టుకొనే వాడు. ఇంకొకడు చనిపోయినవారి కుటుంబాలకు అవసరమైన సహాయం చేసేవాడు.**

ఆ ఇంటి నుంచి బయటికి వచ్చేసరికి మధ్యాహ్నం దాటిపోయింది. యానాం వీధిలో ఎండ మండుతోంది. సాధారణ రోజుల్లో ఆ సమయంలో రేవు వైపు వెళ్లే ఎద్దుబండ్లు, బస్తాలు మోసే కూలీలు, బజారులో తిరిగే జనంతో వీధి నిండిపోయేది. ఇప్పుడు వీధి కుక్కలు కూడా కనిపించలేదు. మూసిన తలుపులు మాత్రమే.

ఒక ఇంటి ముందు చిన్న దీపం వెలుగుతోంది. పక్కనే ఎవరూ లేరు. మరొక ఇంటి అరుగుపై పిల్లల ఆటబొమ్మలు పడి ఉన్నాయి. వాటిని చూసి డ్యూపాంట్ కాసేపు ఆగాడు. పిల్లలు ఎక్కడ? లోపల ఉన్నారా? అనారోగ్యంతో ఉన్నారా? లేక... ఆ ఆలోచనను పూర్తి చేయకుండా ముందుకు నడిచాడు.

ఆ రోజు నుంచి డ్యూపాంట్ తిరిగే దారులు పెరిగాయి.

కురసాంపేట, దరియాలతిప్ప, మాలపేట, మెట్టకుర్రు, కనకాలపేట. మధ్యలో యానాం వీధులు.

ఎక్కడి నుంచి వార్త వస్తే అక్కడికి వెళ్లేవాడు.

"ఫాదర్, మా ఇంట్లో ఇద్దరికి." అతను వెళ్లేవాడు.

"ఫాదర్, మా అమ్మకు జబ్బు." అతను వెళ్లేవాడు.

"ఫాదర్, మా ఇంట్లో ఎవరూ లేరు." అక్కడికీ వెళ్లేవాడు.

అలాంటి ఇళ్లలో అడుగు పెట్టేటప్పుడు డ్యూపాంట్ గుండె వేగంగా కొట్టుకునేది. అతనికీ భయం ఉండేది. దానితోనే బతకడం, ముందుకు సాగడం, ఎదుటివారికి దానిని కనిపించనివ్వకపోవటం నేర్చుకున్నాడు.

ఎక్కడైనా ఇంటి తలుపు మూసి ఉంటే తట్టేవాడు.

"ఎవరైనా ఉన్నారా?"

లోపల నుంచి గొంతు వస్తే, "నీళ్లు కావాలా?" అని అడిగేవాడు.

సమాధానం రాకపోతే మళ్లీ తట్టేవాడు. కొన్ని తలుపులు తెరుచుకునేవి. కొన్ని తెరుచుకునేవి కావు.

కొన్ని ఇళ్లలో అతను వెళ్లేసరికి మనిషి చనిపోయి ఉండేవాడు.

అక్కడ కొద్దిసేపు కూర్చునేవాడు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ప్రార్థన చేసేవాడు.

ఎవరూ లేని ఇంట్లో కూడా.

ఒక సాయంత్రం రేవు దగ్గర డ్యూపాంట్ ని చూసిన పడవనడిపే ముత్తయ్య అడిగాడు "ఫాదర్, మీరు రోజూ ఎన్ని ఇళ్లకు వెళ్తున్నారు?"

"తెలియదు, ఎవరు పిలిస్తే అక్కడకు వెళ్తాను."

"ఎందుకు?"

"నా ప్రాణం నాకు ఎంత విలువో, ఆ ఇంట్లో ఒంటరిగా పడి ఉన్న మనిషి ప్రాణం కూడా అతనికి అంతే విలువ."

"మీరు కూడా చనిపోవచ్చు."

డ్యూపాంట్ నవ్వాడు. "అది నాకు తెలియదని అనుకుంటున్నావా?"

"అయితే?"

"ఒక మనిషి చనిపోతాడని తెలిస్తే అతన్ని ఒంటరిగా వదిలేయాలా?"

ముత్తయ్య ఏమీ మాట్లాడలేదు.

ఒక ఉదయం డ్యూపాంట్ ఒక ఇంటి ముందు నిలబడ్డాడు. తలుపు మూసి ఉంది. లోపల నుంచి బలహీనమైన దగ్గు వినిపించింది. తలుపు తట్టాడు.

సమాధానం లేదు.

మళ్లీ తట్టాడు.

"నేను డ్యూపాంట్."

కొద్దిసేపటి తర్వాత లోపల నుంచి ఒక మగ గొంతు.

"వెళ్లిపోండి."

"ఎందుకు?"

"నాకు ఇష్టం లేదు"

డ్యూపాంట్ కాసేపు మౌనంగా ఉన్నాడు.

"సరే. నేను ఇక్కడే కూర్చుంటాను."

లోపల నుంచి గొంతు వచ్చింది.

"ఎందుకు?"

"మీరు ఒంటరిగా ఉండకూడదని."

చాలాసేపు నిశ్శబ్దం.

తర్వాత తలుపు కొద్దిగా తెరుచుకుంది.

లోపల ముప్పై ఏళ్ల మనిషి. అతని శరీరం నీరసంగా ఉంది.

డ్యూపాంట్ లోపలికి వెళ్లాడు. అతనికి కొన్ని నీళ్లు ఇచ్చాడు.

ఆ మనిషి డ్యూపాంట్ ని చూస్తూ అడిగాడు:

"నన్ను తాకడానికి మీకు భయం లేదా?"

డ్యూపాంట్ అతని చెయ్యి పట్టుకున్నాడు.

"భయం ఉంది."

ఆ మనిషి ఆశ్చర్యంగా చూశాడు. డ్యూపాంట్ మెల్లగా అన్నాడు:

"కానీ మిమ్మల్ని ఒంటరిగా వదిలేయడం నాకు ఇంకా ఎక్కువ భయం."

ఆ మనిషి కళ్లలో నీళ్లు. అతను మొదటిసారి డ్యూపాంట్ చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

ఇద్దరూ అలాగే చాలాసేపు ఉండిపోయారు.

యానాంలో పరిస్థితి మరింత దారుణంగా మారింది.

ప్రతి ఉదయం కొత్త మరణాలు. కొన్నిసార్లు పదుల సంఖ్యలో. కొన్నిసార్లు అంతకంటే ఎక్కువ. శవాలను మోసేవాళ్లు లేరు. రోగులను చూసేవాళ్లు లేరు. ఇళ్లలో అన్నం వండేవాళ్లు లేరు. కొన్ని కుటుంబాల్లో ఒకరే మిగిలారు. వాళ్లకూ జబ్బు వస్తే— ఆ ఇంటి కథ ముగిసినట్టే.

డ్యూపాంట్ నిద్ర అనే మాట మరచిపోయాడు

ఉదయం చర్చిలో ప్రార్థన. తరువాత ఎక్కడ అవసరం పడితే అక్కడకు. మందులు అయిపోయాయి. రోగుల వద్ద కూర్చుని వారికి ధైర్యం చెప్పటమో, ప్రార్థన చేయటమో మాత్రమే మిగిలింది.

అతని బట్టలు మురికిగా మారాయి. కొన్ని సార్లు రోగుల ఇళ్లలో వారిపక్కనే పడుకొనేవాడు. మరుసటి ఉదయం లేచి మరలా అదే దినచర్య.

ఒకరోజు రేవు దగ్గర ముత్తయ్య అతన్ని ఆపాడు.

"ఫాదర్."

"ఏమిటి?"

"ఇక వెళ్లకండి."

"ఎక్కడికి?"

"ఎక్కడికైనా."

"ఎందుకు?"

"మీరు అలసిపోయారు." డ్యూపాంట్ నవ్వాడు.

"అవును అలసిపోయాను."

"అయితే విశ్రాంతి తీసుకోండి."

"తీసుకుంటాను."

"ఎప్పుడు?"

డ్యూపాంట్ రేవు వైపు చూశాడు.

"ఎవరూ నన్ను పిలవని రోజు."

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ముత్తయ్య ఏమీ మాట్లాడలేదు. తన పడవ నుంచి ఒక గుడ్డలో మూటకట్టిన అరటిపళ్ల అత్తలాన్ని తీసుకొచ్చి అతని చేతిలో పెట్టాడు.

"కనీసం వీటినైనా తీసుకెళ్లండి."

***

ఒక రోజు సాయంత్రం కురసాంపేట నుంచి చర్చికి తిరిగి వచ్చిన డ్యూపాంట్ కోసం ఒక ఫ్రెంచ్ అధికారి గుర్రపు బండితో ఎదురుచూస్తున్నాడు. "ఫాదర్, వెంటనే రావాలి. పెద్దొరగారి భార్యకు కలరా లక్షణాల్లా ఉన్నాయి," అన్నాడు. డ్యూపాంట్ తన చిన్న వైద్య సంచిని తీసుకుని బండెక్కాడు. యానాం పెద్దొర Val□re Hugot నివసించే ప్రభుత్వ భవనాన్ని చేరుకున్నాడు.

ఆ ఇంటి సేవకుల్లో ఆందోళన కనిపించింది. ఆయన భార్య మెత్తని పరుపు మంచం మీద పడుకొని ఉంది. డ్యూపాంట్ ఆమెను జాగ్రత్తగా పరిశీలించాడు. వాంతులు, విరేచనాలు ఎక్కువగా లేవు; నీటిని కోల్పోయిన కలరా రోగుల్లో కనిపించే శరీర లక్షణాలూ లేవు. కొన్ని ప్రశ్నలు అడిగి, నాడి చూసిన తర్వాత, "ప్రస్తుతం కనిపిస్తున్న లక్షణాలు కలరాను సూచించడం లేదు. అయినా ఈ సమయంలో జాగ్రత్త తప్పదు. రేపటి వరకు పరిస్థితిని గమనించాలి," అన్నాడు.

హ్యూగోట్ కొంత ఊపిరి పీల్చుకున్నాడు. డ్యూపాంట్ సేవకురాలికి జాగ్రత్తలు చెప్పాడు. "శుభ్రమైన నీళ్లే ఇవ్వండి. కుండలు, పాత్రలు తరచూ శుభ్రం చేయండి. ఇంటి చుట్టూ మురికి నీరు నిలవనివ్వకండి. తేలికైన, మంచి ఆహారం ఇవ్వండి. గది మూసి ఉంచకుండా గాలి బాగా ఆడేలా చూడండి. వాంతులు, విరేచనాలు పెరిగితే వెంటనే నాకు కబురు పంపండి."

"యానాంలో డాక్టర్ ఉంటే ఇంత భయపడాల్సిన అవసరం ఉండేది కాదు," అన్నాడు హ్యూగోట్.

"అవును, అందుకే నాకు తెలిసినంతవరకు నేర్చుకున్నాను. ఈ వ్యాధి విషయంలో మనం జాగ్రత్తగా ఉండటమే ముఖ్యం." అంటూ హ్యూగోట్ ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

హ్యూగోట్ బల్ల మీదున్న ఫ్రెంచి అధికారిక పత్రిక Journal Officiel ను చేతిలోకి తీసుకున్నాడు. పాండిచ్చేరి నుంచి వచ్చే ఆ సంచికలో కలరా వ్యాప్తికి సంబంధించిన వార్తలు ఉన్నాయి. ఇద్దరూ కొద్దిసేపు వాటి గురించి మాట్లాడుకున్నారు.

వీడ్కోలు తీసుకునే ముందు డ్యూపాంట్ మళ్లీ హ్యూగోట్ భార్యను చూసి, "ఈ రాత్రి విశ్రాంతి తీసుకోండి. శుభ్రమైన నీళ్లు తాగండి. ఏమైనా ఇబ్బందిగా అనిపిస్తే వెంటనే కబురు పంపండి," అన్నాడు.

బయటికి వచ్చిన డ్యూపాంట్‌కు సాయంత్రపు చల్లని గాలి తగిలింది. వెనుక పెద్దొర ఇంటి వెలుగు. ముందర కలరా చీకటిలో మునిగిన పేదల ఇళ్లు. ఆ రెండు ప్రపంచాల మధ్య డ్యూపాంట్ ఒక్క క్షణం నిలిచాడు. తర్వాత తన సంచిని భుజాన వేసుకుని చీకటి వైపే నడిచాడు.

***

ఒకరోజు సాయంత్రం డ్యూపాంట్ మాలపేటకు వెళ్లాడు. అక్కడ ఒక ఇంటి ముందు ఐదారుగురు మగవాళ్లు నిలబడి ఉన్నారు. వాళ్ల ముఖాల్లో భయం స్పష్టంగా కనిపించింది.

"లోపల ఎవరు?" అని డ్యూపాంట్ అడిగాడు.

"మా అక్క, ఆమె పిల్లలు," అని ఒకడు చెప్పాడు.

"మీరెందుకు లోపలికి వెళ్లడం లేదు?" అతను సమాధానం చెప్పలేదు. అతని పక్కన ఉన్న వృద్ధుడు, "లోపలికి వెళ్లినవాళ్లకూ జబ్బు వస్తోంది ఫాదర్. మా ఇంట్లో ఇప్పటికే ఇద్దరు పోయారు," అన్నాడు.

"భయం ఉండటం తప్పుకాదు, ఆ భయం వల్ల మనం వారిని వదిలేసినట్లు వాళ్ళకు అనిపించకూడదు"

అతను లోపలికి వెళ్లాడు.

ఆ ఇంట్లో ఒక నడివయసు స్త్రీ మంచం మీద పడి ఉంది. చెమటవల్ల ఆమె జుట్టు నుదుటికి అతుక్కుపోయింది. కళ్లను తెరవడానికి కూడా శక్తి లేదు. పక్కనే రెండేళ్ల పిల్లవాడు ఏడుస్తూ ఆమెను పట్టుకుని ఉన్నాడు. మరో మూలలో కొంచెం పెద్ద బాలుడు కూర్చుని ఉన్నాడు. అతని కళ్లలో కన్నీళ్లు లేవు; భయం మాత్రమే ఉంది. డ్యూపాంట్ పిల్లవాడిని ఎత్తుకుని, "ఏం తిన్నావు?" అని అడిగాడు. బాలుడు తల ఊపాడు. "ఏమీ లేదా?" మళ్లీ తల ఊపాడు. డ్యూపాంట్ తన సంచిలో ఉన్న కొద్దిపాటి అటుకులు తీసి వాని చేతిలో పెట్టాడు. పిల్లవాడు తినడం మొదలుపెట్టాడు. ఆ దృశ్యం చూస్తూ తల్లి కళ్లలో నీళ్లు వచ్చాయి. ఆమె మాట్లాడలేకపోయింది. డ్యూపాంట్ ఆమె దగ్గర కూర్చుని నీళ్లు ఇచ్చాడు. ఆ రాత్రి అతను ఆ ఇంటి నుంచి వెళ్లలేదు.

రాత్రి పెరిగేకొద్దీ ఇంటి లోపల వాసన మారింది. చెమట, వాంతులు, తడి బట్టలు, మూసిన గది ఉక్కపోత——అన్నీ కలిసిపోయాయి.

బయట వర్షం పడుతుందేమో అన్నట్టు గాలి బలంగా వీచింది. ఇంటి పైకప్పు తాటాకులు రుద్దుకుంటూ శబ్దం

చేశాయి. డ్యూపాంట్ దీపాన్ని దగ్గరకు లాక్కొని రోగి శ్వాసను గమనిస్తూ కూర్చున్నాడు. కొన్నిసార్లు ఆమె శరీరం ఒక్కసారిగా వణికేది. పిల్లవాడు భయంతో తల్లి దగ్గరకు చేరేవాడు. "అమ్మకేమైంది?" అని ఒకసారి అడిగాడు. డ్యూపాంట్ సమాధానం చెప్పడానికి కాసేపు ఆగాడు. "ఇప్పుడు మనం ఆమెను చూసుకుంటున్నాం," అన్నాడు. ఆ సమాధానం పిల్లవాడికి పూర్తిగా అర్థం కాకపోయినా ఇంకేమీ అడగలేదు.

మరుసటి ఉదయం ఆమె పరిస్థితి కొంత మెరుగు పడింది. డ్యూపాంట్ ఆమె దేహం మీద బట్టలు సరిచేసి, ప్రార్థన చేసి బయటకు వచ్చాడు. బయట నిలబడి ఉన్న కుటుంబ సభ్యుల్లో ఒకరు "ఫాదర్, మీరు భయపడరా?" అడిగాడు. డ్యూపాంట్ అతని వైపు చూసి, "భయప డతాను".

"అయితే లోపల ఎందుకు కూర్చున్నారు?" డ్యూపాంట్ కొద్దిసేపు అతని వైపు చూసి

"ఎవరో తన దగ్గర ఉన్నారని ఆమె ధైర్యపడాలి" అన్నాడు.

ఆ మాట విని రాత్రంతా బయటే ఉండిపోయిన వాళ్లు మౌనంగా ఉండిపోయారు.

ఆ రోజు నుంచి డ్యూపాంట్ ఒక్కడే తిరగటం కాకుండా అతనితో మరి కొందరు రావడం మొదలుపెట్టారు. మొదట ముత్తయ్య. తర్వాత మాలపేటనుంచి ఇద్దరు యువకులు. డ్యూపాంట్ ముందుగా నడుస్తుంటే ధైర్యం తెచ్చుకొని వెనుక నడిచేవారు. ఒకడు నీళ్లు మోసేవాడు. మరొకడు డ్యూపాంట్ తోలుసంచి పట్టుకొనే వాడు. ఇంకొకడు చని పోయినవారి కుటుంబాలకు అవసరమైన సహాయం చేసేవాడు. డ్యూపాంట్ వారికి పెద్దగా ఆదేశాలు ఇవ్వలేదు. "ఎవరికి ఏది చేతనైతే అది చేయండి," అనేవాడు.

అయితే అందరూ అలా ముందుకు రాలేదు. కొందరు అతన్ని చూసి దూరంగా తప్పుకునేవారు. అతను కులభేదం చూడకుండా ప్రతి ఇంటికీ వెళ్తున్నాడన్న విషయం కొందరికి అసహనంగా మారింది. చర్చికి వచ్చే ఒక వ్యక్తి ఒకరోజు డ్యూపాంట్‌ను నిలదీశాడు. "ఫాదర్, మీరు ఎక్కడెక్కడ తిరు గుతున్నారో మీకైనా తెలుసా? కిందికులాల ఇళ్లకు వెళ్లి వచ్చిన వెంటనే పైకులాల ఇళ్లలోకి వెళ్తున్నారు. మీరు చర్చిలో పూజారి. ఇలా ప్రతి కులం ఇంటికీ తిరిగితే మీ పవిత్రత ఏమవుతుంది? మీరు చేస్తున్న పని ఊరి కట్టుబాట్లను చెడగొడుతుంది." అని నిలదీశాడు.

"జబ్బుపడిన మనిషి ఏ కులం వాడో అడిగి నేను లోపలికి వెళ్లాలా?" అని డ్యూపాంట్ ప్రశ్నించాడు.

"అది మీకు తెలియకపోవచ్చు. కానీ ఊరికి తెలుసు" అన్నాడా వ్యక్తి.

డ్యూపాంట్ మెల్లగా అన్నాడు, "జబ్బుపడిన మనిషిలో నాకు కనిపించేది కులం కాదు... ప్రాణం. ఈ మహమ్మారి తగ్గిన తర్వాత ఎవరు ఎవరితో ఎలా ఉండాలో మీ ఆచారాలు మీ ఇష్టం."

ఆ వ్యక్తి ఇంకేమీ మాట్లాడలేదు.

కలరా యానాంలో మరింత విస్తరించింది.

ఒకరోజు డ్యూపాంట్ నడుస్తున్నప్పుడు మొదటిసారి అతని అడుగులు బరువుగా అనిపించాయి. ఈ మహమ్మారి మొదలైనప్పటి నుంచి అతను చూసిన మరణాలన్నీ అతని మనసులో తిరిగాయి. ఎన్ని ఇళ్లు? ఎన్ని ముఖాలు? ఎంతమంది పిల్లలు? తాను ఎంత మందిని కాపాడాడు? ఎంతమంది తన కళ్ళముందే కళ్లుమూసారు? ఏడాది కాలంగా జరిగిన సంఘటనలన్నీ అతని జ్ఞాపకాల్లో కదలాడాయి.

ఆ సాయంత్రం అతను చర్చి వెనుక చిన్న గదిలో చేతులు కడుక్కున్నాడు. ముఖం మీద నీళ్లు చల్లుకున్నాడు. అద్దంలో తనను తాను చూసుకున్నాడు. కళ్ల కింద నల్లటి వలయాలు. గడ్డం పెరిగింది. పెదవులు ఎండిపోయాయి. అతను కాసేపు కళ్లుమూసుకొన్నాడు. ఒంటరిగా కూర్చున్నాడు.

"నేను ఇంకా ఎంతకాలం ఇలా తిరగగలను?" అనే ప్రశ్న మొదటిసారి అతని మనసులో బలంగా వచ్చింది.

అప్పుడే బయట నుంచి తలుపు తట్టిన శబ్దం వచ్చింది.

"ఫాదర్! ... ఫాదర్!"

డ్యూపాంట్ లేచాడు.

తలుపు తెరిచాడు. ముత్తయ్య నిలబడి ఉన్నాడు.

"కనకాలపేటలో ఒక మనిషి పరిస్థితి బాగోలేదట."

డ్యూపాంట్ అతన్ని కొద్దిసేపు చూశాడు.

తర్వాత తన సంచిని తీసుకున్నాడు.

"వెళ్దాం."

ముత్తయ్య అతని ముఖం చూశాడు. "మీరు అలసి పోయారు."

"తెలుసు."

"పోనీ కొద్దిసేపు విశ్రాంతి తీసుకోండి."

డ్యూపాంట్ తలుపు మూస్తూ అన్నాడు, "ఆ మనిషికి కూడా అలసట ఉంటుంది. అతనికి ఆగే అవకాశం లేదు."

ఇద్దరూ చీకటిలోకి నడిచారు.


కనకాలపేటలో ఆ ఇల్లు చాలా చిన్నది. తలుపు బయట ఒక మహిళ ఏడుస్తోంది. లోపల ఆమె భర్త నులకమంచంమీద పడుకొని ఉన్నాడు. పక్కనే నాలుగైదేళ్ల పిల్లవాడు తల్లిని పట్టుకుని ఉన్నాడు. ఆ తండ్రి శరీరం నీరసంగా

"నాకు తెలియదు."

"అయితే మీరు ఎందుకు వచ్చారు?"

"మీరు ఒంటరిగా ఉండకూడదని," అన్నాడు డ్యూపాంట్ అతని చేతిని చేతిలోకి తీసుకొని నొక్కుతూ.

రోగి కళ్ళార్పకుండా డ్యూపాంట్ నే చూస్తున్నాడు. అతని కళ్ల కొనల్లో నీళ్లు తిరిగి, చెంపల మీదుగా జారిపోయాయి.



ఉంది. కళ్లను తెరిచి ఉంచడానికి కూడా శక్తి లేదు. ఉదయం నుంచీ స్పృహలో లేడట. ఎగశ్వాస వస్తోంది. డ్యూపాంట్ అతని దగ్గర కూర్చుని సగం తెరచిన పెదవుల మధ్య నీళ్లు పోశాడు. ఒక్క నాలుగు చుక్కలు గొంతులోకి దిగగానే అతను కళ్లు తెరిచాడు.

"ఇంకొంచెం," అన్నాడు డ్యూపాంట్.

"వద్దు." బలహీనంగా అన్నాడు.

"కొద్దిగా మాత్రమే."

రోగి కళ్లను తెరిచి అతన్ని చూశాడు. "నన్ను కాపాడగలరా?"

డ్యూపాంట్ మౌనంగా ఉన్నాడు.

"చెప్పండి."

కొద్దిసేపటి తర్వాత అతని ఎగశ్వాస కొంచెం సద్దుమణిగింది.

ఆ రాత్రి అతని పరిస్థితి క్రమంగా మెరుగుపడింది. ఉదయం అతను కొద్దిగా కూర్చోగలిగాడు. భార్య కళ్లలో మొదటిసారి ఆశ కనిపించింది. డ్యూపాంట్ బయటికి వచ్చేసరికి ముత్తయ్య నవ్వుతూ, "ఇవాళ ఒకరిని మనం బతికించాం," అన్నాడు.

డ్యూపాంట్ నవ్వలేదు. "మనం కాదు. అతనే బతకాలని పోరాడాడు," అన్నాడు.

కొన్నిరోజులకు యానాంలో పరిస్థితి కొంచెం మారింది. మరణాల సంఖ్య తగ్గడం మొదలైంది. కొత్తగా జబ్బుప

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

దుతున్న వారి సంఖ్య కూడా కొంత తగ్గింది. అయినా భయం ఇంకా అలాగే ఉంది. కొందరు తమ ఇళ్ల నుంచి బయటికి రావడానికి ధైర్యం చేయలేదు. కొందరు బంధువులను కోల్పోయి మౌనంగా కూర్చున్నారు. రేవులో మళ్లీ ఒకటి రెండు పడవలు కదలడం మొదలైంది. బజారులో ఒక దుకాణం తలుపు తెరిచింది. ఆ తలుపు తెరుచుకోవడం యానాం ప్రజలకు చిన్న సంఘటన కాదు. అది పట్టణం మళ్లీ బతుకుతున్న సంకేతం.

ఒక సాయంత్రం డ్యూపాంట్ రేవు దగ్గర నిలబడి గోదావరి వైపు చూశాడు. ఎన్నో రోజుల తర్వాత అతనికి ఆ నది శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది. మధ్యలో ముత్తయ్య వచ్చి, "ఫాదర్, ఇప్పుడైనా కొంచెం విశ్రాంతి తీసుకోండి," అన్నాడు. డ్యూపాంట్ నవ్వుతూ, "ఇప్పుడు ఎవరు పిలవడం లేదు కదా," అన్నాడు. ముత్తయ్య, "అదే మీకు విశ్రాంతి," అన్నాడు.

అప్పుడే దూరంగా ఒక చిన్న బాలుడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. "ఫాదర్! ఫాదర్!" అని అరిచాడు. డ్యూపాంట్ అతని వైపు చూశాడు. "మా అమ్మ లేచింది," అన్నాడు బాలుడు. "నిజమా?" "అవును. మీరే రావాలని అంటోంది." డ్యూపాంట్ కాసేపు ఆ బాలుడి ముఖాన్ని చూశాడు. తర్వాత తన సంచిని తీసుకున్నాడు.

ముత్తయ్య నవ్వుతూ, "ఇప్పుడే కదా విశ్రాంతి అన్నది," అన్నాడు.

డ్యూపాంట్ కూడా నవ్వాడు. "అది మరో రోజు."

బాలుడి వెంట అతను మళ్లీ నడిచాడు.

యానాం వీధుల్లో అప్పటికే చీకటి పడుతోంది. కొన్నిచోట్ల తలుపుల ముందు దీపాలు వెలిగాయి. ఒక ఇంటి నుంచి పిల్లవాడి నవ్వు వినిపించింది. మరో ఇంటి నుంచి ఎవరో పాత్రలు కడుగుతున్న శబ్దం వచ్చింది. దూరంగా రేవులో పడవ కదిలింది. చాలా రోజుల తర్వాత యానాం మళ్లీ తన మామూలు శబ్దాలను వెతుక్కుంటోంది.

డ్యూపాంట్ వెనక్కి తిరిగి పట్టణాన్ని చూశాడు. అతను ఎన్ని ప్రాణాలను కాపాడాడో ఎవరికీ తెలియదు. ఎంతమందిని కాపాడలేకపోయాడో కూడా ఎవరికీ తెలియదు. అతని సేవ గురించి తరువాత ఒక అధికారిక నమోదు మాత్రమే మిగిలింది— "యానాంలో వైద్యులు లేని సమయంలో 1848 కలరా బాధితులకు డ్యూపాంట్ సేవ చేశాడని." ఆ చిన్న వాక్యం వెనుక అతను నడిచిన మైళ్ల దూరాలు, తెరిచిన తలుపులు, తాకిన జ్వరపీడిత దేహాలు, తుడిచిన కన్నీళ్లు, ఒంటరిగా గడిపిన రాత్రులు, తనలో తానే పోరాడిన సందర్భాలు ఏవీ కనిపించవు.

చాలా సంవత్సరాల తర్వాత రేవు దగ్గర ఓ వృద్ధుడు తన మనవడికి ఆ రోజులను చెబుతున్నాడు. అప్పుడు యానాంలో ఎంతమంది చనిపోయారో లెక్కలే లేవు.

"తాతయ్యా, అప్పట్లో అందరినీ ఎవరు కాపాడారు?"

వృద్ధుడు గోదావరి వైపు చూశాడు.

"అందరినీ ఎవరూ కాపాడలేకపోయారు. ఒక చర్చి ఫాదరు ఉండేవాడు."

"డాక్టరా?"

"కాదు."

"మరి?"

"కలరాతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లేవాడు."

ఎందుకు?

"ఎందుకంటే... అక్కడ ఎవరో అతనికోసం ఎదురు చూస్తూ ఉండేవారు.

మరణం ప్రతి ఇంటి తలుపు తట్టిన ఆ రోజుల్లో, తలుపులు మూసుకున్న పట్టణంలో ఒక్కో తలుపు తెరుస్తూ వెళ్ళిన వ్యక్తి అతను."

వృద్ధుడు కాసేపు మౌనంగా ఉండి అన్నాడు...

"అప్పుడు అతన్ని చర్చి ఫాదరు అనుకున్నాం. ఇప్పుడు గుర్తు చేసుకొంటే... అతను మనిషి. అందరూ వెళ్ళిపోయిన చోట మనిషి పక్కన చివరి వరకూ నిలిచిన చివరి మనిషి"

గోదావరి మీద గాలి వీచింది చల్లగా.

చరిత్ర: 1848లో యానాంలో కలరా వ్యాపించినట్లు 27 అక్టోబర్ 1848న పాండిచ్చేరి Conseil d'Administration సమావేశంలో నమోదైంది. అనంతరం 24 జనవరి, 1849న French Minister of Colonies, రాసిన ఒక అధికారిక లేఖలో, వైద్యులు లేని యానాంలో చర్చి ఫాదర్ డ్యూపాంట్ (Dupont) కలరా బాధితులకు చూపిన నిస్వార్థ సేవ ప్రత్యేకంగా ప్రస్తావించబడింది.

కథలోని పాత్రలు, సంఘటనలు, సంభాషణలు, భావోద్వేగాలు రచయిత కల్పన.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# సిక్స్ ప్యాక్ గణేశుడు

జీవీ రమేష్, 70323 31155

'ఇదిగో, కాఫీ అడిగి అరగంట అయింది. ఈ రోజుకి ఇవ్వగలవా?' కోపాన్ని వ్యంగ్యంగా మార్చాడు ఆనందరావు.

'ఉండండి మహానుభావా. ఎక్కడి అంట్లు అక్కడే ఉన్నాయి. లక్ష్మి ఇంకా రాలేదు. రిటైర్ అయిన తర్వాత కూడా నా చేత ఉరుకులు, పరుగులు పెట్టిస్తే ఎలా?' విసుక్కుంటూ అర్ధాంగి కమల కాఫీ తెచ్చింది.

'ఈ రోజు మీటింగ్ ఉంది. ప్రెసిడెంట్ ని నేనే ఆలస్యం అయితే ఎలా చెప్పు? అయినా ఈ లక్ష్మికి ఏమైంది.?' అంటూ రెండు గుక్కల్లో కాఫీ తాగి బయటపడ్డాడు.

అప్పుడే లక్ష్మి వస్తూ కనిపించింది. రోజూ ఆమె కొంగు పట్టుకుని తిరిగే ఐదేళ్ల కొడుకు కనిపించలేదు.

'వినాయకుడేడీ?'

ఇంట్లో ఉన్నాడు బాబూ' ఆనందరావు ప్రశ్నకు గబ గబా నడుస్తూ సమాధానం చెప్పింది.

లక్ష్మి కొడుకు గణేష్ కి బుజ్జి పొట్ట ఉంటుంది. అందుకే సరదాగా వినాయకుడు అంటూ ఉంటాడు ఆ పెద్దాయన.

వాచ్ మ్యాన్ శంకర్ భార్య లక్ష్మి. భర్తకు చేదోడు, వాదోడుగా అపార్టుమెంట్లోని నాలుగిళ్ళల్లో పని చేస్తోంది. బతుకు తెరువు కోసం ఏడాది కిందట ఇద్దరూ సిటీకి వలస వచ్చి, ఇక్కడ పనికి చేరారు. ఇద్దరూ నెమ్మదస్తులు. నమ్మకంగా ఉంటారు. బాధ్యతగా పని చేస్తారు.

'అందరికీ నమస్కారం. మరో పదిహేను రోజుల్లో వినాయక చవితి రాబోతోంది. ఇది అందరికీ ఇష్టమైన పండగ. ఎప్పటిలానే ఈ సంవత్సరం కూడా మన అపార్టుమెంట్ లో ఘనంగా జరుపుకోవాలి. ఇతర వివరాలు మన సెక్రటరీ శేఖర్ గారు వివరిస్తారు. సభ్యులు కూడా తమ విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుకుంటున్నాను,' తన ఉపన్యాసాన్ని క్లుప్తంగా ముగించి కుర్చీలో కూలబడ్డాడు ఆనంద రావు.

'ఇది అందరి పండగ. ప్రధానంగా పిల్లల పండగ. ఈ ఏరియా లో ఉన్న అపార్టుమెంట్ లు అన్నింటికంటే ఘనంగా మనం జరుపుకోవాలి. గతంలోలా అందరూ తలో చేయి వేసుకోవాలి. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి కాబట్టి, ఈ సారి కనీస చందా రెండు వేల రూపాయలుగా అనుకుంటున్నాము. సభ్యుల ఆసక్తి, స్తోమత బట్టి ఎక్కువ మొత్తంలో ఇవ్వొచ్చు. మన ప్రెసిడెంట్ గారు చెప్పినట్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో మీ అందరి సూచనలు ఎంతో అవసరం.'

'రెండు వేల రూపాయలు ఎక్కువేమో! వంద ఇళ్లున్నాయి. అంటే రెండు లక్షల రూపాయలు. అంత అవుతుందా?' ఖర్చు విషయంలో వెనుకడుగు వేసే శ్యామల రావు అడిగాడు.

'వంద ఫ్లాట్ లు ఉన్నా పది ఖాళీగానే ఉన్నాయి. మీ రెండో ఫ్లాట్ కూడా ఖాళీ గానే ఉంది కదా. వాటికి ఎలానూ చందాలు రావు. స్టేజి, పందిరి, డెకరేషన్, కుర్చీలు, లైటింగ్, రెండు పూటలా పూజలు, ప్రసాదాలు, తొమ్మిది రోజులూ రాత్రి అపార్టుమెంట్ వాసులందరికీ భోజన, ఫలహారాలు... ఇవన్నీ కలిసి రెండు లక్షల కంటే ఎక్కువే అవుతాయి. ముందు ఫ్లాట్ కి మూడు వేలు అనుకున్నాం. కానీ రెండు వేలు అయితే అందరికీ అందుబాటులో ఉంటుంది కదా అని నిర్ణయించాం.'

మూడు వేలు అనే మాట కంటే రెండు వేలే శ్యామల రావు చెవులకి ఇంపుగా అనిపించింది. అంగీకార సూచనగా మౌనాన్ని ఆశ్రయించాడు.

'కార్యక్రమం సజావుగా నిర్వహించడానికి కొన్ని కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి. ఆసక్తి ఉన్న వాళ్లంతా కమిటీ లలో చేరి తమ సహాయ సహకారాలు అందించాలి. ఆ వివరాలన్నీ మన సెక్రటరీ, ట్రెజరర్ సురేష్ గారు చూస్తారు. ఈ సంబరానికి నా వంతుగా పది వేలు ఇస్తున్నాను' ప్రెసిడెంట్ ప్రకటించాడు.

అందరూ ఉత్సాహంగా ముందుకు రావడంతో ఓ నాలుగు రోజుల్లోనే చందాల వసూలు దాదాపు పూర్తి అయింది. రెండు లక్షలు అనుకుంటే మూడు లక్షల రూపాయల వరకూ వచ్చినట్లు లెక్క తేలింది. మరో రెండు రోజుల్లో రానున్న ఆదివారం మరో సారి అపార్టుమెంట్ వాసులతో సమావేశం పెట్టి, ఏర్పాట్లు మొదలు పెట్టాలి అనుకున్నారు.

'అబ్బా ఈ లక్ష్మితో చచ్చే చావు వచ్చింది. రెండు రోజుల నుంచి మనిషి కనిపించలేదు. నమ్మకంగా పనిచేస్తోంది అనుకుంటే, ఈ మధ్య బాగా ఎగనామం పెడుతోంది,' భార్య విసుక్కోవడం వినిపించింది.

ఈలోగా లక్ష్మి హడావిడిగా వచ్చి, వంటింట్లోకి పరుగు తీసింది. ఆమె కళ్ళల్లో అలసట, ముఖంలో ఆందోళన ఆనందరావు కంటబడ్డాయి. తన భార్య ఆమె మీద కేకలేస్తోంది. లక్ష్మి మాత్రం ఏమీ మాట్లాడకుండా, పని పూర్తి చేసింది.

'లక్ష్మీ, ఏమైంది?,' ఆమె వెళ్తుంటే అడిగాడు.

' గణేష్ కి బాగోలేదు బాబూ. నాలుగు రోజులు బట్టి కాస్త నలతగా నీరసంగా ఉన్నాడు. డాక్టర్ దగ్గరికి తీసుకుని వెళ్తే పొట్టలో ఏదో కణితి ఉందని చెప్పారు. ఈ మధ్య పొట్ట పెరుగుతూ ఉంటే, బాగా తినడం వల్ల అనుకున్నాం. కానీ ప్రాణం మీదకు వచ్చే రోగమని తెలియలేదు బాబూ,' బావురుమంది.

'డాక్టర్ ఏం అన్నాడు?'

'వెంటనే ఆపరేషన్ చేయాలంట. గవర్నమెంట్ ఆస్పత్రిలో సరైన డాక్టర్లు లేరట.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ఏం చేయాలో తోచట్లేదు బాబూ'

'ఎంత ఖర్చవుతుంది?'

'ఐదారు లక్షల వరకూ అవుతాదట, పొట్ట చేత్తో పట్టుకుని వచ్చినోల్లం. మా దగ్గర అంత డబ్బేడ ఉంటది బాబూ,' లక్ష్మి కన్నీళ్లతో చెప్పింది.

'ఒకసారి రిపోర్ట్లు తీసుకొని రా, నా ఫ్రెండ్ డాక్టర్. అతన్ని సలహా అడుగుతాను'

'నిజమే ఆనందం. ఇది హై రిస్క్ ట్యూమర్. రోజు రోజుకీ పెరుగుతోంది. రోబోటిక్ సర్జరీ ఒక్కటే ఆప్షన్. ఆలస్యం కాకూడదు. ' రిపోర్ట్ పరిశీలించిన డాక్టర్ శ్రీహరి ముక్తాయించాడు.

'సర్జరీకి ఐదారు లక్షల వరకు కావచ్చం టున్నారు. నువ్వేమైనా మాట సాయం చేస్తే...'

'చేయొచ్చు కానీ, కనీసం నాలుగు లక్షలకైనా వాళ్ళు సిద్ధం కావాలి '

'వాళ్ళు నిరుపేదలు రా. పక్క రాష్ట్రం నుంచి ఏడాది కిందట వచ్చారు. గవర్నమెంట్ స్కీం లు వర్తించవు. ఫండ్ రైజింగ్ కు టైం లేదు'

'లేట్ అయ్యే కొద్దీ మరిన్ని కాంప్లికేషన్స్ వస్తాయి. సాధ్యమైంత తొందరగా నిర్ణయం తీసుకోవాలి.' ఫ్రెండ్ మాటలకు సాలోచనగా తలూపాడు ఆనంద రావు.

వినాయక చవితి ఏర్పాట్ల గురించి చర్చించేందుకు ఆదివారం సాయంత్రం మరోసారి సభ్యులకు మీటింగ్ పెట్టారు. ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యా యునిగా పనిచేసి రిటైర్ అయిన మల్లికా ర్జునరావు కూడా హాజరయ్యారు. పదవీ విరమణ చేసినా.. ఆయన్ని అపార్టుమెంట్ వాసులంతా పీఈటీ సార్ అని గౌరవంగా పిలుస్తుంటారు.

'సభ్యులందరూ నేను చెప్పేది కొంచెం ప్రశాంతంగా, ఓపికగా వినండి' ఉపోద్ఘాతం గా చెప్పాడు ఆనందం. ఆయన గొంతు గంభీరంగా ఉంది. దూరంగా ఓ నలుగురు పిల్లలు ఆడుకుంటున్నారు.

'మన వాచ్ మ్యాన్ శంకర్ కుటుంబం గురించి మీ అభిప్రాయం ఏంటి?'

'చాలా మంచి ఫ్యామిలీ. వాళ్ళు వచ్చిన తర్వాత దొంగతనాలు కూడా తగ్గాయి' ఓ సభ్యుడు బదులిచ్చాడు.

'వాళ్ళ అబ్బాయికి ఆరోగ్యం బాగాలేదు. ఆ విషయం మీకు తెలుసు కదా!' ఆనందరావు అడిగాడు..

'అవును, ఆపరేషన్ చేయాలట' మరో సభ్యుడు చెప్పాడు.

'దానికి చాలా ఎక్కువ డబ్బులు ఖర్చు అవుతాయి. మనమందరం చందాలు ఇస్తే..?'

'ఎంతమందికి చందాలిస్తాం? అయినా పని చేసినందుకు జీతం ఇస్తున్నాం కదా. వాళ్ళ పిల్లల ఆరోగ్యాలు, చదువులు ఇవన్నీ మన బాధ్యత కాదు' కరాఖండిగా చెప్పాడు శ్యామలరావు.

'శ్యామలరావు గారు, నేను చెప్పేది వినండి. వాళ్లకు సాయం చేయాలనేది కేవలం ఒక రిక్వెస్ట్ మాత్రమే. మొన్నే వినాయక ఉత్సవాలకు చందాలు ఇచ్చాం కాబట్టి, ఇక ఇవ్వలేం అంటారా! నా దగ్గర ఒక ఆలోచన ఉంది. అది ఎంతవరకు ఆచరణ సాధ్యమో మీరు చెప్పాలి. ఈ విషయం గురించి నేను మన పీఈటీ గారితో కూడా మాట్లాడాను. ట్రెజరర్, సెక్రెటరీ గారికి కూడా నా ఆలోచన నచ్చింది. కొంచెం ఓపికగా నా మాట వినండి.'

'ముందు విషయం చెప్పండి,' శ్యామలరావు అసహనంగా అన్నాడు.

'గణేష్ చతుర్థి కి మూడు లక్షల రూపాయలు వసూలైంది కదా, ఆ మొత్తాన్ని ఆ పసివాడి వైద్యానికి ఇద్దాం.' సెక్రటరీ అన్నాడు.

'మరి పండగ పోస్టుపోన్ చేద్దామా? మన వీలు బట్టి వేరే రోజు చేద్దామా? ' శ్యామలరావు వెటకారంగా అడిగాడు.

'ముందు మా ఆలోచన చెప్పనివ్వండి. సభ్యుల అంగీకారం లేకుండా ఏదీ జరగదు' ట్రెజరర్ రామకృష్ణ భరోసా ఇచ్చాడు.

'మనం ఈసారి గ్రీన్ వినాయక చవితి జరుపుకుంటే ఎలా ఉంటుంది అనేది మా ఆలోచన. వాచ్ మ్యాన్ కు సాయపడటం అనేది ఒక అంశం మాత్రమే. కానీ డెకరేషన్, లైటింగ్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో వినాయకుడి విగ్రహం వీటిని ఈసారి వదిలేద్దాం. ఇవి డబ్బుల ఖర్చు మాత్రమే కాదు, పొల్యూషన్ కూడా.' పీఈటీ సార్ అన్నారు.

'మరి ఇవన్నీ ఎక్కడ నుంచి వస్తాయి?'

'ఈ పండగలో మన పిల్లలను కూడా భాగస్వామ్యం చేద్దాం. పీఈటీ గారి ఆధ్వర్యంలో వాళ్ళు వినాయకుడి విగ్రహం తయారుచేస్తారు. ఆకులు, పువ్వులతో పందిరిని అలంకరిద్దాం. మన 201 ఫ్లాట్ ఓనర్ సత్యనారాయణ గారు తన నర్సరీ నుంచి పూల కుండీలు పంపిస్తామన్నారు. డీజే, డెకరేషన్ లాంటి హడావుడి ఉండదు. మన దగ్గర ఉన్న చిన్న మైక్ వాడుకుందాం,' సెక్రటరీ తన ప్రసంగాన్ని ఆపి, సభ్యుల వైపు చూసాడు.

దూరంగా ఆడుకుంటున్న నలుగురు పిల్లలు మొదట్నుంచి ఈ మాటలు వింటున్నారు. వాళ్ళ సమాచార మార్పిడి చాలా వేగంగా ఉంటుంది. నలుగురు కాస్తా పది నిముషాల్లో 20 మంది అయ్యారు.

'వాళ్లకి చదువుకోడానికే టైం లేదు,' తన కొడుకుని ఎలాగైనా ఐఐటి చదివించాలి అనుకుంటున్న మూడో ఫ్లోర్ మంగళగౌరి నిరసన తెలియజేసింది.

'ట్యూషన్స్ పోతాయి. చదువులు వెనుకబడి పోతాయి' అంటూ చాలామంది అభ్యంతరాలు చెప్పారు.

'నేను ర్యాంకులు, చదువుల గురించి మాట్లాడను. మీ పిల్లల భవిష్యత్తు గురించి మీ బాధ్యత, భయాలు నాకు తెలుసు. కానీ రోజూ సాయంత్రం వేళ ఓ రెండు గంటలు పిల్లలను ఈ పండగలో భాగస్వామ్యం చేయండి.' పీఈటీ సార్ అభ్యర్థించాడు.

'పిల్లలు వాళ్ళేం చేయగలరండీ..?' 301 ఓనర్ కాంతారావు ప్రశ్నించారు.

'పిల్లల గురించి మనం చాలా తక్కువ అంచనా వేస్తున్నాం. పనులేమీ అప్పచె ప్పకుండా మనమే అన్నీ సమకూర్చి, వాళ్ళ మీద నమ్మకాన్ని కోల్పోతున్నాం. వినాయక చవితికి కావలసినవన్నీ వాళ్ళే తయారు చేస్తారు. కాగితాలతో తోరణాలు తయారుచేసి, అలంకరిస్తారు. చుట్టుపక్కల అపార్టుమెంట్ నిర్మాణాలు జరుగుతున్నాయి. కావాల్సినంత మట్టి దొరుకుతుంది. పిల్లలే స్వయంగా వినాయకుడి విగ్రహాన్ని తయారు చేస్తారు. నేను వాళ్ళ ని గైడ్ చేస్తాను. ఈ నవరాత్రుల నిర్వహణ వాళ్లకు అప్పగించి, కొన్ని అనుభవాలను, జ్ఞాపకాలను

అందిద్దాం.

'మరి ఇతరత్రా ఖర్చులు..'

'మన ప్రెసిడెంట్ గారు, పీఈటీ గారు, ట్రెజరర్ గారు, నేను రాత్రి భోజనాలు స్పాన్సర్ చేస్తాం. ఇక ప్రసాదాలు లాంటి ఖర్చులు సభ్యుల్లో కొంతమంది స్పాన్సర్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు' సెక్రటరీ అన్నాడు.

"ముందే గ్రౌండ్ ప్రిపేర్ చేశారన్నమాట " శ్యామలరావుతో వ్యంగ్యంగా అన్నాడు.

'వాచ్ మ్యాన్ కుటుంబానికి డబ్బులు సాయం చేయడం అనేది ముఖ్య విషయం కానే కాదు. పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, సహకారం,. సమన్వయం, ఇలాంటివన్నీ కూడా ఈ పండగ రూపంలో అలవాటు చేద్దామని మా ప్రయత్నం. ఈ పండగ పూర్తి అయ్యేనాటికి చదువుల్లోనే కాదు, కలిసి ఏదైనా సాధించడంలో కూడా వాళ్ళు ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకుంటారు.' ఆనందరావు అన్నాడు.

'మా అభి అసలే దుడుకు. అందరితో గొడవ పడతాడండి. రోజూ వాడితో పంచాయతీలు పడుతున్నాను. మీరు ఎన్నైనా చెబుతారు. తర్వాత నేను మాటలు పడాలి' 305 ఫ్లాట్ ఓనర్ శ్రీదేవి చెప్పింది.

'మేడం, నేను అన్నీ చూసుకుంటాను. మీ వరకూ ఎలాంటి కంప్లైంట్స్ రావు. అసలు క్రమశిక్షణ కమిటీ లీడర్ వాడే,' పీఈటీ సార్ మాటలకి అందరికీ నవ్వు వచ్చింది.

ఇక్కడే చాలామంది పిల్లలు ఉన్నారు కదా. వాళ్ళను అడుగుదాం ఏమంటారో?'

'మేము రెడీ' పిల్లలంతా అన్నారు ముక్త కంఠంతో, ఉత్సాహంగా.

తమ బిడ్డలకు సరైన వ్యాయామం లేదు అనే గిల్టీ ఫీలింగ్ తో ఉన్న తల్లిదండ్రులకు కూడా ఈ ఆలోచన నచ్చింది.

'కానీ రెండు గంటలు మాత్రమే,' మంగళ గౌరి కండిషన్ పెట్టింది.

'అది చాలమ్మా. మధ్యలో ఓ రెండు రోజులు సెలవులు ఉన్నాయి. అప్పుడు ఇంకాస్త ఎక్కువ టైం కేటాయిస్తారు,' ట్రెజరర్ అన్నాడు.

సభ్యులందరి అంగీకారంతో మూడు లక్షల రూపాయలని వాచ్ మ్యాన్ కి ఇచ్చారు. సాయంత్రం ఐదు గంటలకు పిల్లలందరూ చేరడం. పనులను వాటాలు వేసుకోవడం, రెండు గంటలు పని చేయడం ఇదీ అందరి వరస. మట్టి తెచ్చేవాళ్ళు, పేపర్లతో పూలు, అలంకరణ వస్తువులు చేయడం, స్టేజి పైన అలంకరించడం, శంకర్ తెచ్చిన రకరకాల ఆకుల్ని, కొమ్మల్ని అందంగా అలంకరించడం.. ఇలా సాయంత్రాలు.. సెల్లార్ సందడిగా మారిపోయింది. పిల్లలు మట్టి తెచ్చి స్వయంగా చేసిన భారీ వినాయకుడు అందర్నీ ఆకర్షించాడు. యూట్యూబ్ సహాయంతో విగ్రహాన్ని బాగా తయారు చేసారు. సహజ రంగులు అద్దడంతో గణేశుడు కొత్త కళని సంతరించుకున్నాడు..

'ఆంటీ అభి ఉన్నాడా?'

'ఇప్పుడే స్కూల్ నుంచి వచ్చాడు. కిందకు వస్తాడు లెండి,' తల్లి జవాబు చెప్పే లోపు

'ఏమయిందిరా' అంటూ అభి బెడ్ రూమ్ లోంచి వచ్చాడు.

'వీడు గ్రీన్ పేపర్స్ కట్ చేస్తానన్నాడు. కానీ నా బ్లూ పేపర్స్ తీసుకున్నాడు'

'నిన్న కూడా వీడు బ్లూ పేపర్స్ కట్ చేసాడు' రెండో పిల్లాడు అంటున్నాడు.

'రేయ్, ఏ కలర్ అయితే ఏంటి? నా దగ్గర రేడియం పేపర్ ఉంది. నువ్వు కట్ చెయ్. నేను రెండు నిముషాల్లో వస్తాను. గొడవ పడకండి'

'రోజూ ఇంటిమీదకు పంచాయతీలు తెచ్చే తన అభి, ఈ రోజు పిల్లల గొడవలు తీర్చే నాయకుడిగా ఎదగడం చూసి శ్రీదేవికి ముచ్చటేసింది.

డాక్టర్ శ్రీహరి సాయంతో గణేష్ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి అయింది. ఇన్ఫెక్షన్స్ వ్యాపించకుండా ఉండాలంటే ఆ పిల్లాడిని కొన్నాళ్ళయినా సెల్లార్లో ఉన్న తమ ఇంట్లో ఉంచకూడదు. ఏం చేయాలో శంకర్ కి అర్థం కావడం లేదు

'నీ కొడుకుని ఎప్పుడు డిశ్చార్జ్ చేస్తున్నారు?' శ్యామలరావు అడిగాడు.

'ఎల్లుండి సారు'

'వాడు కింద ఉంటే మంచిది కాదు. రెండో ఫ్లోర్ లో నా ఫ్లాట్ ఖాళీగా ఉంది. ఓ పది రోజులు అక్కడే ఉంచు.' ఆ మాట విని శంకర్ కి నోట మాట రాలేదు. శ్యామల రావు నుంచి అలాంటి మాటని ఊహించలేదు.

'బాబూ గొప్ప సాయం చేస్తున్నారు. మీ రుణం..'

'ఈ చిన్న సాయానికి పెద్ద మాటలెం దుకులే, తర్వాత ఇంటికి వచ్చి తాళం తీసుకెళ్ళు' అంటూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

వినాయక చవితి నాడు అపార్టుమెంట్ అంతా సందడిగా మారింది. ఆకులు, పువ్వులతో అలంకరణ, చుట్టూ పూలకుండీలు, భారీ శబ్దాలు లేని మైక్.. ఆ ప్రాంతానికి పిల్లల వినాయకుడు అట్రాక్షన్ గా మారిపోయాడు. చుట్టు పక్కల అపార్టుమెంట్ వాసులు వచ్చి, ఏర్పాట్లు చూసి, పిల్లల్ని ప్రశంసిస్తున్నారు. చిన్నారుల ఆనందానికి హద్దులు లేకుండా పోయింది.

అప్పటికి గణేష్ ఆస్పత్రి నుంచి వచ్చి ఐదు రోజులైంది. కింద పిల్లల గోల, వినాయకుడి ప్రతిష్ఠ చూసి ఇంట్లో కాలు నిలవలేదు.

'అమ్మా, ఒక్కసారి కిందకు వెళ్తానే!'

'వద్దు నాన్నా. మంచిది కాదు'

'వెంటనే వచ్చేస్తానే, ప్లీజ్' కొడుకు ఆలా అడిగితే ఏ తల్లి కాదనగలదు?

గణేష్ కిందకు రాగానే పిల్లలంతా వాడిని చుట్టుముట్టారు.

'ఒరేయ్, వీడికి పొట్ట తగ్గిపోయిందిరా' ఓ కుర్రాడు అరిచాడు.

'బొజ్జ గణేష్, సిక్స్ ప్యాక్ గణేష్ అయిపో యాడురా,' మరో అబ్బాయి వంత పాడాడు.


'ఆ వినాయకుడు బొజ్జ ఉంటే బాగుంటాడు. కానీ ఈ వినాయకుడు సిక్స్ ప్యాక్ లోనే బాగున్నాడు' పక్కనున్న పీఈటీ సారు అన్నాడు.

'బొజ్జ గణపయ్యకు జై.. సిక్స్ ప్యాక్ గణేష్ కు జై జై' అని పిల్లలంతా అరుస్తూ కేరింతలు కొడుతున్నారు.

వాళ్ళ నవ్వుల మధ్యలో గణేష్ ముఖం పౌర్ణమి నాటి చందమామలా వెలిగి పోతోంది.

..ఈనాడు ఆదివారం

కూచి రామాంజనేయులు
95818 53636




# బందీ...?

కేఫ్‌లో ఆ సాయంత్రం జనం ఎక్కువగా లేరు. బయట వర్షం పడుతోంది. గాజు అద్దాల మీదుగా జారుతున్న నీటి చారలను చూస్తూ రాఘవ కాఫీని మెల్లగా తాగుతున్నాడు. ఎదురుగా అతని స్నేహితుడు, న్యాయవాది శివరాం ప్రసాద్ పేపరు చదువుతున్నాడు. రాఘవకు ముప్పై అయిదేళ్లు. ఉన్నత విద్యావంతుడు. మంచి ఉద్యోగం చేయగల సామర్థ్యం ఉంది. పెళ్లి చేసుకోలేదు. వెనకా ముందూ ఎవరూ లేని ఆవారా జీవితం. కానీ అతను జీవితాన్ని ద్వేషించేవాడు కాదు. జీవితంలో మనుషులు నిర్మించుకున్న కొన్ని విలువలను మాత్రం తీవ్రంగా ప్రశ్నించేవాడు. అతనికి ఒక సిద్ధాంతం ఉండేది.

'ఏ మనిషీ పుట్టుకతో మహాత్ముడు కాదు. పుట్టుకతో నేరస్తుడూ కాదు. అతను పెరిగిన వాతావరణం, ఆకలి, అవమానం, అవకాశం, అధికారం.. ఇవన్నీ కలిసి అతన్ని తయారుచేస్తాయి.' అంటాడు.

అందుకే జైళ్లలో ఉన్న నేరస్తుల జీవిత చరిత్రలు చదివేవాడు. గొప్ప వ్యక్తుల జీవితాలూ చదివేవాడు. అతనికి విచిత్రమైన కలలు ఉండేవి. ఎప్పటికైనా ప్రపంచంలోని గొప్ప పుస్తకాలన్నీ ఒకేచోట ఉంచి, తనకంటూ గ్రంథాలయం ఏర్పాటు చేసుకోవాలి!, పియానో నేర్చుకోవాలి. వయోలిన్ వాయించాలి. గ్రీకు తత్వవేత్తలను మూలభాషలో చదవాలి. ఒకరోజు హిమాలయాల్లో ఒంటరిగా నెలరోజులు గడపాలి. ఇలా.. అంతలో శివరాం పేపరును మడిచి, టేబుల్ మీద పెట్టాడు. 'రాఘవా.. ఇవాళ సుప్రీం కోర్టులో ఒక ముఖ్యమైన తీర్పు ఉంది.'

'దేని గురించి?'

'ముగ్గురిని హత్య చేసిన ఖైదీ. కింది కోర్టు ఉరిశిక్ష వేసింది. దాన్ని యావజ్జీవంగా మార్చాలా వద్దా అన్నది ఇవాళ తేలుతుంది.' రాఘవ పేపరు తీసుకున్నాడు. అప్పుడే కేఫ్‌లోకి నరేంద్రవర్మ వచ్చాడు. అతను శివరాంకు స్నేహితుడు. పెద్ద వ్యాపారవేత్త. రాఘవకు కూడా కొద్దిపాటి పరిచయం ఉంది.

'ఏమిటి అంత సీరియస్‌గా?' అంటూ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. శివరాం విషయం చెప్పాడు.

వర్మ నవ్వాడు. 'ఇందులో చర్చేముంది? నా దృష్టిలో యావజ్జీవం కంటే ఉరే మంచిది.' అన్నాడు.

రాఘవ తలెత్తి చూశాడు 'ఎందుకు?' అన్నట్లు.

'ఒక్కసారి ఆలోచించు. సంవత్సరాల తరబడి నాలుగు గోడల మధ్య బతకాలి. ప్రతి ఉదయం అదే గోడ. ప్రతి రాత్రీ అదే తలుపు. స్వేచ్ఛ లేదు. కుటుంబం లేదు. జీవితం లేదు. అలాంటి నరకం కంటే ఒక్క నిమిషంలో చనిపోవడం మంచిది.'

రాఘవ చిరునవ్వు నవ్వాడు.

'నువ్వు మరణాన్ని చాలా తేలిగ్గా మాట్లాడుతున్నావు వర్మా.'

'కాకపోతే అంత ఒంటరితనం భరించడం తేలికంటావా ?'

'ప్రాణం ఉన్నంతకాలం అవకాశం ఉంటుంది.'

'ఏ అవకాశం?'

'మనిషి మారడానికి.'

వర్మ నవ్వేశాడు.

'నాలుగు గోడల మధ్యనా?'

'గోడలు శరీరాన్ని ఆపగలవు వర్మా. ఆలోచనను కాదు.'

'పుస్తకాలలో బాగుంటాయి ఈ మాటలు.' రాఘవ ముఖం గంభీరమైంది.

'ఒక మనిషికి పుస్తకాలు ఇవ్వు. సంగీతం ఇవ్వు. ఆలోచించడానికి సమయం ఇవ్వు. అతను నాలుగు గోడల మధ్య ఉన్నా ప్రపంచాన్ని చూడగలడు.' బలంగా అన్నాడు రాఘవ.

వర్మ కాఫీ కప్పును టేబుల్ మీద గట్టిగా పెడుతూ..'ఐదేళ్లు ఉండు చూద్దాం. ఒక్క మనిషిని చూడకుండా. ఒక్కరితో మాట్లాడకుండా. ఐదేళ్లు పూర్తయ్యేలోపు తలుపు బద్దలు కొట్టి బయటకు వస్తావు. లేకపోతే పిచ్చివాడివవుతావు.' అన్నాడు.

'ఐదేళ్లు ఎందుకు? పదేళ్లు ఉంటాను.' రాఘవ వెంటనే అన్నాడు.

'రాఘవా!' అని శివరాం ఉలిక్కిపడ్డాడు.

కానీ వర్మలో వ్యాపారవేత్త అహం మేల్కొంది.

'పదేళ్లా?'

'అవును.'

'పదేళ్లు బయట ప్రపంచంతో సంబంధం లేకుండా ఉండగలవా?' ఉక్రోషంగా అడిగాడు.

'ఉంటాను.' నమ్మకంగా అన్నాడు రాఘవ.

వర్మ క్షణం ఆలోచించాడు.

'ఉంటే... ఏడాదికి పది లక్షలు. పదేళ్లకు కోటి రూపాయలు.' ఇస్తాను..! గర్వంగా అన్నాడు వర్మ.

టేబుల్ దగ్గర నిశ్శబ్దం.

శివరాం ఇద్దరినీ చూశాడు.

'మీరు మాట్లాడుతున్నది ఆట కాదు. జీవితంలో పదేళ్లు.'

'అందుకే చేస్తున్నాను.' రాఘవ అన్నాడు.

వర్మ చేయి ముందుకు చాచాడు.'ఒప్పందమా?'. రాఘవ అతని చేతిని అందుకున్నాడు. 'ఒప్పందం.' అంటూ.

❖ ❖ ❖

శివరాం ప్రసాద్ సమక్షంలో ఒప్పందం తయారైంది. వర్మ ఇంటి వెనుక భాగంలో ఉన్న విశాలమైన అవుట్‌హౌస్‌లో రాఘవ పదేళ్లు ఉండాలి.

అతను బయటకు రాకూడదు. ఎవరినీ ప్రత్యక్షంగా కలవకూడదు. టెలిఫోన్, రేడియో, టెలివిజన్ ఉండకూడదు. కానీ అతను కోరిన పుస్తకాలు, ఆహారం, సంగీత వాయిద్యాలు, రాత సామగ్రి అన్నీ వర్మ సమకూర్చాలి. పదేళ్లు పూర్తయిన క్షణానికి రాఘవ అక్కడే ఉంటే వర్మ కోటి రూపాయలు ఇవ్వాలి. ఒక్క నిమిషం ముందుగా బయటకు వచ్చినా.. పందెంలో ఓడిపోయినట్టే. సంతకాలు పూర్తయ్యాయి. శివరాం పెన్ను మూసేస్తూ అన్నాడు. 'ఈ కాగితం మీద రెండు సంతకాలు కనిపిస్తున్నాయి. కానీ మీరు ఇద్దరూ పెట్టింది సంతకాలు కాదు. మీ జీవితాల్లో పదేళ్లు.' ఎవరూ సమాధానం చెప్పలేదు.

❖ ❖ ❖

మొదటి కొన్ని నెలలు రాఘవకు నరకంగానే అనిపించాయి. మనిషి ముఖం చూడాలని అనిపించేది.ఎవరితోనైనా మాట్లాడాలని అనిపించేది. అర్ధరాత్రి లేచి తలుపు దగ్గరకు వచ్చేవాడు. తలుపు తెరిస్తే పందెం ముగుస్తుంది.. ఆ అవుట్ హౌస్ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంది మరి. ఎన్నోసార్లు చేతిని తలుపు గడియ మీద పెట్టాడు.. కానీ తెరవలేదు. పుస్తకాలు అడిగాడు. మొదట నవలలు. టాల్‌స్టాయ్, దోస్తయెవ్‌స్కీ, చెకోవ్, హ్యూగో, డికెన్స్.. ఒక జీవితంలో ఉండాల్సినంతమంది మనుషులను పుస్తకాలలో కలిశాడు. కొన్ని నెలలకు వయోలిన్ తెప్పించుకున్నాడు. రాత్రివేళ

అవుట్‌హౌస్ నుంచి వినిపించే అపస్వరాలను వర్మ నవ్వుకుంటూ వినేవాడు. 'రాఘవకు పిచ్చెక్కుతోంది,' అనుకునేవాడు. కానీ ఆ అపస్వరాలు క్రమంగా సంగీతంగా మారాయి.

❖ ❖ ❖

కాల చక్రంలో రెండేళ్లు వెనక్కి వెళ్లి పోయాయి..

రాఘవ చరిత్ర చదివాడు.. రాజులు ఎలా సామ్రాజ్యాలు నిర్మించారో చదివాడు...ఆ సామ్రాజ్యాల కోసం ఎంతమంది చనిపోయారో చదివాడు.. యుద్ధాలు చదివాడు.. మతాలు చదివాడు.. విప్లవాలు చదివాడు. ఒకరోజు వర్మకు చిన్న చీటీ వచ్చింది. 'ఇంకా చరిత్ర పుస్తకాలు పంపించు. ముఖ్యంగా ఓడిపోయినవారి చరిత్ర.'

వర్మ ఆశ్చర్యపోయాడు. 'ఓడిపోయినవారి చరిత్రా?' అనుకున్నాడు.

❖ ❖ ❖

ఐదో సంవత్సరం రాఘవ తత్వశాస్త్రంలోకి వెళ్లిపోయాడు. బుద్ధుడు, సోక్రటీస్, మార్కస్ ఆరేలియస్, ఉపనిషత్తులు, భగవద్గీత, నీషే, కామూ, ప్రపంచం మనిషిని ఎలా చూసిందో చదివాడు, మనిషి ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాడో చదివాడు. ఒకప్పుడు ప్రపంచంలోనే గొప్ప వ్యక్తిగత లైబ్రరీ నిర్మించాలని కలలు కన్న రాఘవకు ఒక విచిత్రమైన విషయం అర్థమవుతోంది. పుస్తకాలను సొంతం చేసుకోవడం కంటే, వాటిలోని జ్ఞానం మనల్ని సొంతం చేసుకోవడం గొప్పదని.

❖ ❖ ❖

తన బందిఖానా జీవితానికి మరో రెండేళ్లు మాత్రమే మిగిలి ఉంది. ఇప్పుడు రాఘవ చాలా తక్కువ పుస్తకాలు అడుగుతున్నాడు. కొన్ని రోజులు ఒక్క పుస్తకం కూడా అడగలేదు. కిటికీ దగ్గర కూర్చుని చెట్టును చూస్తూ గంటలు గడిపేవాడు. ఒకప్పుడు ప్రపంచాన్ని తెలుసుకోవాలని తపించిన మనిషి ఇప్పుడు తనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. అదే సమయంలో బయట ప్రపంచంలో నరేంద్రవర్మ జీవితం మారుతోంది. అతను చేసిన రెండు భారీ పెట్టుబడులు నష్టపోయాయి. ఒక కంపెనీ మూతపడింది. బ్యాంకు అప్పులు పెరిగాయి. ఆస్తులు అమ్మాల్సి వచ్చింది. ఒకప్పుడు కోటి రూపాయలు అతనికి పెద్ద విషయం కాదు.

ఇప్పుడు అదే కోటి అతని జీవితాన్ని కూల్చగల మొత్తం.

❖ ❖ ❖

పందెం ముగియడానికి ఇంకా మూడు రోజులు. నరేంద్రవర్మ తన గదిలో ఒంటరిగా కూర్చున్నాడు. టేబుల్ మీద పాత ఒప్పంద కాగితాలు కనిపించాయి. అందులో రాఘవ సంతకం, తన సంతకం. కోటి రూపాయలు. వర్మ చేతులు వణికాయి.

'వాడు గెలిస్తే.. నా పని ముగిసిపోతుంది.' మొదటిసారి ఒక భయంకరమైన ఆలోచన అతని మనసులోకి వచ్చింది.

రాఘవ లేకపోతే? వర్మ ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు.

'ఏమిటి నేను ఆలోచిస్తున్నది?'

కానీ డబ్బు భయం మళ్లీ మాట్లాడింది. పది సంవత్సరాల క్రితం కేఫ్‌లో ఒక నేరస్తుడి ఉరిశిక్ష గురించి మాట్లాడిన మనిషి.. ఇప్పుడు తానే ఒక హత్య గురించి ఆలోచిస్తున్నాడు.

❖ ❖ ❖

చివరి రాత్రి పందెం పూర్తవడానికి ఇంకా అరగంట ఉంది. వర్మ నిశ్శబ్దంగా అవుట్‌హౌస్‌లోకి ప్రవేశించాడు. తాళం అతని దగ్గరే ఉంది. లోపల దీపం వెలుగుతోంది.

రాఘవ కనిపించలేదు. బాత్రూమ్‌లో నీటి శబ్దం వినిపిస్తోంది. వర్మ టేబుల్ దగ్గరకు వెళ్లాడు. అక్కడ ఒక కాగితం ఉంది. పైన..

'నరేంద్రవర్మకు..'అని రాసి ఉంది. వర్మ చదవడం మొదలుపెట్టాడు.

❖ ❖ ❖

'వర్మా,

పదేళ్ల క్రితం నువ్వు నాకు కోటి రూపాయలు ఇస్తానన్నప్పుడు, ఆ డబ్బుతో నేను ప్రపంచంలోనే గొప్ప వ్యక్తిగత గ్రంథాలయం నిర్మించాలని అనుకున్నాను. సంగీత మందిరం నిర్మించాలని అనుకున్నాను. ప్రపంచమంతా తిరగాలని అనుకున్నాను. కానీ ఈ పదేళ్లలో ఒక విచిత్రం జరిగింది. నేను ప్రపంచాన్ని చూడలేదు. కానీ ప్రపంచమంతా నా గదిలోకి వచ్చింది. పుస్తకాల ద్వారా రాజులతో మాట్లాడాను. ఖైదీలతో ఏడ్చాను. యుద్ధాల్లో చనిపోయినవారిని చూశాను. ప్రేమించినవారిని చూశాను. మోసం చేసినవారిని చూశాను. దేవుణ్ణి వెతికినవారినీ చూశాను. దేవుడు లేడని వాదించినవారినీ చూశాను. చివరకు ఒక విషయం అర్థమైంది. మనిషి జీవితంలో చాలా భాగం 'నాది' అనే ఒక్క పదం చుట్టూ తిరుగుతోంది. నా డబ్బు, నా ఇల్లు, నా పేరు, నా విజయం, నా కుటుంబం, నా జీవితం, ఈ "నా" అనే పదాన్ని కాపాడుకోవడానికి మనిషి తన జీవితాన్నే కోల్పోతున్నాడు. పదేళ్ల క్రితం నువ్వు నన్ను ఈ గదిలో బంధించావని అనుకున్నాను. ఇప్పుడు అర్థమైంది.

నేను ఈ గదిలో బందీగా ఉన్నాను..! నువ్వు నీ సంపదలో బందీగా ఉన్నావు!. నా గదికి తాళం నీ దగ్గర ఉంది. నీ గదికి తాళం ఎక్కడుందో నాకు తెలియదు.

నువ్వు నాకు ఇవ్వాల్సిన కోటి రూపాయలు నాకు అవసరం లేదు. ఈ ఒప్పందం పూర్తవడానికి పది నిమిషాల ముందు నేను ఈ గది నుంచి బయటకు వెళ్లిపోతాను.

అంటే చట్టపరంగా నేను ఓడిపోయినట్టే. నీ కోటి రూపాయలు నీవే.

కానీ వర్మా.. నేను ఈ పదేళ్లలో తెలుసుకున్న గొప్ప సత్యం ఒక్కటే. మనిషికి ఎంత ఉందన్నది సంపద కాదు. ఎంత లేకపోయినా ప్రశాంతంగా ఉండగలడన్నదే సంపద.'

- రాఘవ.

❖ ❖ ❖

వర్మ చేతిలో కాగితం వణికిపోయింది. అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. తన జేబులోకి చేయి పెట్టాడు. రాఘవను చంపడానికి తెచ్చుకున్న చిన్న కత్తి చేతికి తగిలింది.

దాన్ని బయటకు తీసి చూశాడు. కొన్ని క్షణాల పాటు స్తంభించిపోయాడు. తర్వాత కత్తిని నేలమీద వదిలేశాడు. లోపల నుంచి బాత్రూమ్ తలుపు తెరుచుకుంది.

రాఘవ బయటకు వచ్చాడు. ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు. పదేళ్ల క్రితం చూసిన రాఘవ ఇతను కాదు. జుట్టులో తెలుపు వచ్చింది. ముఖం చిక్కిపోయింది.

కానీ కళ్లలో ఒక విచిత్రమైన ప్రశాంతత ఉంది. రాఘవ నేలమీద ఉన్న కత్తిని చూశాడు. తర్వాత వర్మను చూశాడు. ఏమీ అడగలేదు. ఆ మౌనమే వర్మను మరింత కుంగదీసింది.

'రాఘవా...' అతని గొంతు వణికింది.

'నన్ను క్షమించు.'

రాఘవ ప్రశాంతంగా అడిగాడు.

'దేనికి?'

వర్మకు మాట రాలేదు. కొద్దిసేపటి తర్వాత అన్నాడు. 'నిన్ను చంపాలని వచ్చాను.' రాఘవ ముఖంలో ఆశ్చర్యం లేదు. వర్మ కన్నీళ్లు తుడుచుకున్నాడు.

'కోటి రూపాయలు ఇవ్వలేనేమో అన్న భయం... నన్ను హంతకుడిగా..' రాఘవ అతని దగ్గరకు వచ్చాడు.

'పదేళ్ల క్రితం కేఫ్‌లో నేను ఏమన్నానో గుర్తుందా వర్మా?'

వర్మ తలెత్తాడు. 'ఏ మనిషీ పుట్టుకతో నేరస్తుడు కాడని.'

వర్మ కళ్లలోకి చూస్తూ రాఘవ అన్నాడు. 'ఈ రాత్రి నువ్వే దానికి సాక్ష్యం.'

వర్మ తలదించుకున్నాడు. 'అంటే నేను నేరస్తుడినేనా?'

'కాదు..' రాఘవ నేలమీద ఉన్న కత్తిని చూపించాడు.

'నిన్ను ఇక్కడికి తీసుకొచ్చింది నీ స్వభావం కాదు. నీ భయం. నీ పరిస్థితి. నీ డబ్బు మీదున్న మమకారం.'

'కానీ నేను నిన్ను చంపాలని అనుకున్నాను.' అన్నాడు వర్మ.

'ఆలోచనకూ చర్యకూ మధ్య ఒక చిన్న ప్రదేశం ఉంటుంది వర్మా. అక్కడే మనిషి ఇంకా మనిషిగా మిగిలే అవకాశం ఉంటుంది.'

వర్మ మౌనంగా ఏడుస్తున్నాడు. గోడ గడియారం శబ్దం వినిపిస్తోంది. పందెం పూర్తవడానికి ఇంకా పన్నెండు నిమిషాలు.

రాఘవ తన చిన్న సంచి తీసుకున్నాడు. వర్మ ఆశ్చర్యంగా చూశాడు.

'ఎక్కడికి?'

'బయటకు.'

'ఇంకా పన్నెండు నిమిషాలే ఉన్నాయి రాఘవా! పదేళ్లు ఉన్నావు. మరో పన్నెండు నిమిషాలు ఉండలేవా?'

రాఘవ నవ్వాడు.'అందుకే వెళ్తున్నాను.'

'ఎందుకు?'

'పదేళ్లు ఇక్కడ ఉండటం

మిగతా 16 లో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

5వ పేజీ నుంచి

# బందీ...?

కంటే... ఈ పన్నెండు నిమిషాల ముందు వెళ్లిపోవడమే నా పందెం.'

వర్మకు అర్థం కాలేదు. రాఘవ తలుపు దగ్గరకు నడిచాడు.

'పదేళ్ల క్రితం నేను కోటి రూపాయల కోసం ఈ గదిలోకి వచ్చాను. ఇప్పుడు అదే కోటి రూపాయల కోసం మరో పన్నెండు నిమిషాలు ఇక్కడ ఉంటే...'

ఒక్క క్షణం ఆగాడు.

'ఈ పదేళ్లలో నేను చదివిన పుస్తకాలన్నీ ఓడిపోయినట్టే.' వర్మ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. రాఘవ తలుపు తెరిచాడు. బయట తెల్లవారుతోంది.

పదేళ్ల తర్వాత మొదటిసారి బయట గాలి అతని ముఖాన్ని తాకింది. రాఘవ కళ్లు మూసుకున్నాడు. లోతుగా శ్వాస తీసుకున్నాడు. వర్మ వెనుక నుంచి అడిగాడు.

'ఇప్పుడు ఎక్కడికి వెళ్తావు?'

రాఘవ వెనక్కి తిరగలేదు.

'తెలియదు.'

'ఏం చేస్తావు?'

ఈసారి రాఘవ వెనక్కి తిరిగి చిరునవ్వు నవ్వాడు. 'ఇంతకాలం పుస్తకాలలో మనుషులను చదివాను వర్మా...'

కొద్దిగా ఆగాడు. 'ఇక మనుషుల మధ్యకు వెళ్లి మనిషిని చదువుతాను.' రాఘవ బయటకు నడిచాడు.

వర్మ ఒంటరిగా నిలబడిపోయాడు. టేబుల్ మీద ఒప్పందం ఉంది. నేలమీద కత్తి ఉంది. చేతిలో రాఘవ ఉత్తరం ఉంది. గడియారం పన్నెండు దాటింది. పందెం ప్రకారం.. నరేంద్రవర్మ గెలిచాడు. కోటి రూపాయలు అతనివే. కానీ అతనికి మొదటిసారి తన విజయం ఓటమిలా అనిపించింది. అతను నెమ్మదిగా కుర్చీలో కూర్చున్నాడు. రాఘవ చివరి మాటలు ఇంకా గదిలో వినిపిస్తున్నట్టే ఉన్నాయి. 'నేను ఈ గదిలో బందీగా ఉన్నాను. నువ్వు నీ సంపదలో బందీగా ఉన్నావు.''

వర్మ కిటికీ దగ్గరకు వెళ్లాడు. దూరంగా రాఘవ నడుచుకుంటూ వెళ్తున్నాడు. అతని చేతిలో కోటి రూపాయలు లేవు. ఆస్తి లేదు. ఎక్కడికి వెళ్తున్నాడో కూడా తెలియదు.

అయినా అతని నడకలో స్వేచ్ఛ ఉంది. వర్మ తన విశాలమైన ఇంటివైపు చూశాడు. ఆస్తులు ఉన్నాయి. బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. వ్యాపారాలు ఉన్నాయి. కానీ మొదటిసారి తన చుట్టూ కనిపించని గోడలు ఉన్నట్టనిపించింది. వర్మ చేతిలోని ఒప్పందాన్ని చింపేశాడు. కిటికీలోంచి ఉదయిస్తున్న సూర్యుడిని చూస్తూ చాలాసేపు అలాగే నిలబడిపోయాడు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



అనువాద కథ

అతను పెరటి గుండా బయలుదేరి, అడవిలోకి జారుకున్నాడు. చనిపోయిన వారిని కనుగొని వారి బట్టలు ధరించాడు. ఆపై అతను పొలాల గుండా పాకుతూ, ఎవరికీ కనిపించకుండా పొదల చాటుగా, చిన్న శబ్దాలను సైతం వింటూ, ఒక వేటగాడిలా అప్రమత్తంగా ముందుకు వెళ్లాడు. అదును చూసుకుని, సరైన సమయం అని అనిపించగానే, అతను రోడ్డు పక్కకు వెళ్లి ఒక పొద వెనుక దాక్కున్నాడు; కాసేపు ఎదురుచూశాడు. చివరకు, అర్ధరాత్రి వేళ, ఒక గుర్రం పరుగెత్తుకు వస్తున్న శబ్దం అతనికి వినిపించింది. ఒకే ఒక గుర్రపు రౌతు వస్తున్నాడని నిర్ధారించుకోవడానికి అతను తన చెవిని నేలకు ఆనించి విన్నాడు, ఆపై తన పనికి సిద్ధమయ్యాడు. ఒక ఉహ్లాన్ సందేశాలు తీసుకుని వేగంగా వస్తున్నాడు. అతను వస్తున్నప్పుడు కళ్లు, చెవులు అప్రమత్తంగా ఉంచుకున్నాడు. అతను కొద్ది అడుగుల దూరంలో ఉండగానే, ఫాదర్ మిలోన్ రోడ్డుపైకి వచ్చి, 'హెల్ప్! హెల్ప్!' (కాపాడండి! కాపాడండి!) అని మూలుగుతూ కింద పడ్డాడు.



ఇంగ్లీషు: గయే దె మోపాస
తెలుగు అనువాదం:
కె. ఉషారాణి, సెల్: 9492879210

# ఫాదర్ మిలన్

గత నెలరోజులుగా ఎండలు విరగ గాస్తున్నాయి. సూర్యకిరణాల వేడికి ప్రకృతి వికసిస్తోంది; కనుచూపు మేరంతా పొలాలు పచ్చగా కళకళలాడుతున్నాయి. వినీల ఆకాశ గోపురం నిర్మలంగా ఉంది. ఎక్కడా మేఘాలు లేవు. మైదాన ప్రాంతమంతా పొలాలు చెల్లాచెదురుగా విస్తరించి ఉన్నాయి. చుట్టూ ఎత్తుగా ఎదిగిన కానుగ చెట్లు ఉన్న నార్మాండీ వ్యవసాయ క్షేత్రాలను దూరం నుంచి చూస్తే, చిన్నపాటి అడవుల్లా కనిపిస్తాయి. దగ్గరకు వెళ్లి, చెదలు పట్టిన చెక్క కంచెలను దాటి చూస్తే, అదొక చాలా చక్కని చిక్కనితోటలా అనిపిస్తుంది; ఆ రైతుల ముడతలు పడిన చర్మాలలాంటి బెరడులున్న పురాతన ఆపిల్‌చెట్లన్నీ పూతకొచ్చాయి. ఆ పూల సువాసన, ఘాటైన మట్టి వాసన, పశువుల పాకల నుండి వచ్చే వాసనతో కలసి ముక్కులలోకి చొచ్చుకు పోతున్నది.

అది మధ్యాహ్న సమయం. ఇంటిగుమ్మం ముందు నాటిన పియర్ చెట్టు నీడలో ఆ కుటుంబం కూచుని భోజనం చేస్తోంది; తండ్రి, తల్లి, నలుగురు పిల్లలు, పనివాళ్లు...ఇద్దరు మహిళలు, ముగ్గురుపురుషులు అంతా అక్కడే ఉన్నారు. ఎవరూ ఏం మాట్లాడడం లేదు. అందరూ సూప్‌తాగడం ముగించారు, ఆ తర్వాత పంది మాంసం ఒరుగులతో బంగాళాదుంపలు కలిపి వేయించి తీసుకుని వచ్చిన కూర తిన్నారు. అప్పుడప్పుడు అక్కడున్న మహిళల్లో ఒకరు లేచి కుండ తీసుకుని కింద సెల్లార్‌లోకి వెళ్లి మరింత సైడర్-పానీయం-తీసుకుని వస్తున్నారు.

నలభైఏళ్లు దాటిన ఒక దృఢమైనవ్యక్తి, ఇంటి గోడకు పాములా మెలికలు తిరుగుతూ అల్లుకుని ఉన్న ఒక ద్రాక్ష తీగను నిశితంగా గమనిస్తున్నాడు. అదింకా పిందె పట్టలేదు. చూసి చూసి చివరకు అతను, 'నాన్న ద్రాక్షతీగ ఈ సంవత్సరం త్వరగా చిగురిస్తోంది. బహుశా ఈసారి మనకు మంచి దిగుబడి రావొచ్చు' అన్నాడు.

ఆ స్త్రీ వెనక్కి తిరిగి, మారు మాట్లాడకుండా ఒక చూపు విసిరి ఊరుకుంది.

వారి తండ్రిని కాల్చి చంపిన చోటే ఆ ద్రాక్ష తీగను నాటారు.

అది 1870 యుద్ధ సమయం. ప్రష్యన్లు దేశమంతటినీ ఆక్రమించారు. జనరల్ ఫైదెర్బే తన నార్తర్న్ డివిజన్ సైన్యంతో వారిని ఎదిరిస్తున్నాడు.

ప్రష్యన్లు ఈ వ్యవసాయ క్షేత్రంలోనే తమ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ పొలం యజమాని, వృద్ధ రైతు ఫాదర్ పియర్ మిలోన్, తన శక్తి మేరకు వారికి ఆశ్రయం కల్పించి సపర్యలు చేశాడు.



ఒక నెల రోజులుగా జర్మన్ సైన్యం ఆ గ్రామంలోనే ఉంది. ఫ్రెంచ్ సైన్యం ముప్పై కిలోమీటర్ల దూరంలో నిలబడి పోయింది; అయినప్పటికీ, ప్రతి రాత్రి కొంతమంది ఉహ్లాన్లు (జర్మన్ అశ్వికదళ సైనికులు) అదృశ్యమయ్యేవారు.

ఒంటరిగా వెళ్లిన వేగులు కానీ, ముగ్గురు చొప్పున ఔట్‌పోస్టులకు పంపబడుతున్న వారిలో ఏ ఒక్కరుకానీ వెనక్కి తిరిగివచ్చేవారు కాదు.

మరుసటి రోజు ఉదయం, వారు ఏదో ఒక పొలంలోనో, లేదా కందకంలోనో శవాలై కనిపించేవారు. వారి గుర్రాలు కూడా గొంతు కోయబడి, రోడ్లపై పడి ఉండేవి.

ఈ హత్యలన్నీ ఒకే వ్యక్తి చేస్తున్నట్లు అనిపించింది, కానీ ఎవరు చేస్తున్నదీ తెలియలేదు.

ఆ గ్రామం అంతా భయంతో గడగడ వణికిపోయింది. అనుమానం వచ్చిన ప్రతి రైతులను కాల్చి చంపారు, మహిళలను జైల్లో పెట్టారు; సమాచారం రాబట్టడానికి పిల్లలను భయపెట్టారు. కానీ ఏమీ లాభం లేకపోయింది.

కానీ, ఒకరోజు ఉదయం, ఫాదర్ మిలోన్ తన ముఖంపై కత్తి గాయంతో గాదె పక్కన పడి ఉన్నాడు.

పొలానికి ఒకటిన్నర మైలు దూరంలో ఇద్దరు ఉహ్లాన్లు శవాలై కనిపించారు. వారిలో ఒకరి చేతిలో ఇంకా రక్తం ఓడుతున్న కత్తి ఉంది. అతను పోరాడి, తనను తాను రక్షించుకోవడానికి ప్రయత్నించాడు. పొలం ముందు బహిరంగ ప్రదేశంలో వెంటనే కోర్ట్-మార్షల్ (సైనిక న్యాయస్థానం) ఏర్పాటు చేశారు. ఆ వృద్ధుడిని వారి ముందుకు తీసుకువచ్చారు.

అతనికి అరవై ఎనిమిదేళ్లు ఉంటాయి. పొట్టిగా, సన్నగా, వంగిపోయి, ఎండ్రకాయ పంజాల్లాంటి రెండు పెద్ద చేతులతో ఉన్నాడు. అతని జుట్టు రంగుసిరిసిపోయి, చిన్న బాతుపిల్ల ఈకల్లా పలుచగా ఉండి, తల మాడు కనిపిస్తోంది. మెడ చుట్టూ ముడతలు పడిన గోధుమ రంగు చర్మంపై పెద్ద నరాలు, దవడల వెనుక నుండి కణతల వరకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అతనికి చాలా పిసినారి అని, ఎవరితోనూ కలుపుగోలుగా ఉండడని పేరు.

వంటచేసే బల్లను బయటికి లాగి దాని ముందు, నలుగురు సైనికుల మధ్య అతనిని నిలబెట్టారు. ఐదుగురు అధికారులు, ఒక కల్నల్ అతనికి ఎదురుగా కూర్చున్నారు.

కల్నల్ ఫ్రెంచ్‌లో,

'ఫాదర్ మిలోన్, మేము ఇక్కడకి వచ్చినప్పటి నుండి నీ గురించి అంతా మంచిగానే విన్నాము. నువ్వు ఎప్పుడూ మాకు సహాయం చేస్తూ, మర్యాదగా మసలుకుంటూ ఉన్నావు. కానీ ఈ రోజు నీపై ఒక భయంకరమైన అభియోగం మోపబడింది. దానికి నువ్వు సమాధానంచెప్పాలి. నీముఖానికి ఆ గాయం ఎలా తగిలింది?'

ఆ వృద్ధ రైతు ఏ సమాధానం ఇవ్వలేదు.

కల్నల్ కొనసాగించాడు:

'నీ మౌనం నిన్నే దోషిగా నిలబెడుతోంది, ఫాదర్ మిలోన్. నువ్వు నాకు సమాధానం చెప్పి తీరాలి! అర్థమైందా? ఈ ఉదయం కాల్వెరే దగ్గర శవాలై కనిపించిన ఇద్దరు ఉహ్లాన్లను ఎవరు చంపారో నీకు తెలుసా?'

అప్పుడు ఆ వృద్ధుడు స్పష్టంగా బదులిచ్చాడు:

'నేనే.'

ఈసారి ఆశ్చర్యపోవడం కల్నల్ వంతయింది. ఒక నిమిషం పాటు మౌనంగా ఉండి, ఖైదీని తదేకంగా చూశాడు. ఫాదర్ మిలోన్ ఏ భావం కనిపించనీయకుండా, ఒక పూజారితో మాట్లాడు తున్నట్లు కళ్లు దించుకుని నిలబడ్డాడు. గొంతు పట్టేసినట్లుగా, చాలా కష్టపడి పదేపదే లాలాజలాన్ని మింగుతున్నాడు అతడు.

ఆ వ్యక్తి కుటుంబం...అతని కొడుకు జీన్, కోడలు, ఇద్దరు మనవలు అతనికి కొంత దూరంలో భయంగా, అయోమయంగా నిలబడి ఉన్నారు.

కల్నల్ మళ్లీ : 'గత నెలరోజులుగా దేశవ్యాప్తంగా ప్రతి ఉదయం శవాలై కనిపిస్తున్న వేగులనందరినీ ఎవరుచంపారో కూడా నీకు తెలుసా?'

వృద్ధుడు అదే నిర్లిప్తతతో: 'నేనే.'

'వాళ్లందరినీ నువ్వే చంపావా?' 'అవును! నేనే.'

'నువ్వు ఒక్కడివేనా? ఒంటరిగానా?' 'అవును!'

'నువ్వు ఎలా చంపావో చెప్పు.'

ఈసారి ఆ వృద్ధుడిలో కొంత కదలిక వచ్చింది; ఎక్కువసేపు మాట్లాడడానికి అతను ఇబ్బంది పడ్డాడు. నీళ్లు నములుతూ :

'నాకు తెలీదు! చంపేశాను అంతే.'

కల్నల్ : 'నువ్వు నాకు అన్నీ వివరంగా చెప్పాల్సిందేనని నేను హెచ్చరిస్తున్నాను. వెంటనే నిర్ణయించు కుంటే నీకే మంచిది. నువ్వు అసలు ఇదంతా ఎలా మొదలుపెట్టావు?'

అతను తన వెనుకే నిలబడి ఉన్న తన కుటుంబం వైపు ఆందోళనగా చూశాడు. ఒక క్షణం ఆలోచించి, అకస్మాత్తుగా ఆజ్ఞను పాటించాలని నిర్ణయించుకున్నాడు.

'మీరు ఇక్కడికి వచ్చిన మరుసటిరోజు రాత్రి పది గంటల ప్రాంతంలో నేను ఇంటికి వస్తున్నాను. మీరు, మీ సైనికులు నా దగ్గర యాభై ఎక్యూల (కరెన్సీ) విలువైన మేతతో పాటు, ఒక ఆవును, రెండు గొర్రెలను లాక్కున్నారు. నేను నామనసులో, 'వీళ్లు నా దగ్గర ఎంత తీసుకున్నారో, దానికి తగ్గమూల్యం చెల్లించేలా చేస్తాను' అని అనుకున్నాను. అప్పుడే నా మనసులో మరో ఆలోచన వచ్చింది. గాదె వెనుక

(మిగతా 5వ పేజీలో)



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# ఫాదర్ మిలన్

(కథ-4వ పేజీ తరువాయి)

ఉన్న కందకం దగ్గర మీ సైనికులలో ఒకడు పైప్ తాగుతూ ఉండటాన్ని నేను గమనించాను. నేను నా కొడవలి తీసుకుని, ఏమాత్రం శబ్దం చేయకుండా నెమ్మదిగా వెనుక నుంచి వెళ్లాను. గడ్డిపోచను కోసినంత సులువుగా, వాడు ఒక్క మాట కూడా మాట్లాడకముందే ఒకే దెబ్బతో వాడి తల నరికేశాను. మీరు ఆ చెరువు అడుగున వెతికితే, ఒక రాయి కట్టి ఉన్న బంగాళాదుంపల బస్తాలో వాడు దొరుకుతాడు, చూసుకోండి .'

'అప్పుడే నాకొక ఆలోచన వచ్చింది. నేను వాడి బూట్ల నుండి టోపీ వరకు, బట్టలన్నీ వలిచేసి, తీసుకుని, పెరటి వెనుక ఉన్న చిన్న అడవిలో దాచాను.'

వృద్ధుడు కాస్త ఆగాడు. అధికారులు నమ్మలే నట్టుగా నిశ్చేష్టులై ఒకరి ముఖాలు ఒకరు చూసు కున్నారు. విచారణ మళ్లీమొదలైంది, వారు తెలుసు కున్నది ఇది.

ఈ హత్య చేసినప్పటి నుండి, ఆ వ్యక్తి ఒకే ఒక లక్ష్యంతో బతికాడు: 'ప్రష్యన్లను చంపాలి!' అతనిది దేశభక్తి అయినప్పటికీ, అది ప్రష్యన్‌లపై తీవ్రమైన పగ, గుడ్డి ద్వేషంతో ఏర్పడింది. అతను చెప్పినట్లుగా, అతనొక ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. అతను కొన్ని రోజులు ఆగాడు.

ఆక్రమణదారుల పట్ల అతను చాలా వినయ విధేయతలతో ఉన్నందువలన, వాళ్లు అతనిని తన ఇష్టం వచ్చినట్లుగా తిరగడానికి అనుమతించారు. ప్రతిరాత్రి సైనికులు ఔట్‌పోస్ట్‌లకువెళ్లడాన్ని అతను గమనించేవాడు. సైనికులతో స్నేహ పూర్వకంగా ఉండడంవలన తనపనికి అవసరమైన కొన్ని జర్మన్‌పదాలను వాళ్ల దగ్గరినుండి నేర్చు కున్నాడు. ఒకరోజు రాత్రి, సైనికులు ఊరి బయట కాపలాకు వెళుతున్న ఊరిపేరును విని, వారిని వెంబడించాడు.

అతను పెరటి గుండా బయలుదేరి, అడవి లోకి జారుకున్నాడు. చనిపోయిన వారిని కనుగొని వారి బట్టలు ధరించాడు. ఆపై అతను పొలాల గుండా పాకుతూ, ఎవరికీ కనిపించకుండా పొదల చాటుగా, చిన్న శబ్దాలను సైతం వింటూ, ఒక వేటగాడిలా అప్రమత్తంగా ముందుకు వెళ్లాడు.

అదును చూసుకుని, సరైన సమయం అని అనిపించగానే, అతను రోడ్డు పక్కకు వెళ్లి ఒక పొద వెనుక దాక్కున్నాడు; కాసేపు ఎదురు చూశాడు. చివరకు, అర్ధరాత్రి వేళ, ఒక గుర్రం పరుగెత్తుకు వస్తున్న శబ్దం అతనికి వినిపించింది. ఒకే ఒక గుర్రపురౌతు వస్తున్నాడని నిర్ధారించుకోవ డానికి అతను తనచెవిని నేలకు ఆనించి విన్నాడు, ఆపై తన పనికి సిద్ధమయ్యాడు.

ఒక ఉహ్లాన్ సందేశాలు తీసుకుని వేగంగా వస్తున్నాడు. అతను వస్తున్నప్పుడు కళ్లు, చెవులు అప్రమత్తంగా ఉంచుకున్నాడు. అతను కొద్ది అడుగుల దూరంలో ఉండగానే, ఫాదర్ మిలోన్ రోడ్డుపైకి వచ్చి, 'హెల్ప్! హెల్ప్!' (కాపాడండి! కాపాడండి!) అని మూలుగుతూ కింద పడ్డాడు.

గుర్రపు రౌతు ఆగి, అతని యూనిఫామ్ చూసి ఒక జర్మన్ సైనికుడని అనుకున్నాడు. అతను గాయపడ్డాడని భావించి, ఎలాంటి అనుమానం లేకుండా కిందకు దిగి దగ్గరకు వచ్చాడు. ఆ గుర్తు తెలియనివ్యక్తి మీద వంగుతున్నప్పుడు, అతనిపై కడుపులో పొడవాటి కత్తితో బలమైన పోటు పడింది. అతనికి నొప్పి కూడా తెలియకముందే కింద పడిపోయాడు, ఆఖరి క్షణాల్లో మాత్రమే తన్నుకున్నాడు. అప్పుడు ఆ రైతు, ఒక వృద్ధుడికి దక్కే నిశ్శబ్దమైన ఆనందంతో పరవశించిపోతూ, పైకి లేచి, తన ఆత్మతృప్తి కోసం ఆ చనిపోయిన వాడి గొంతు కోశాడు. ఆ తర్వాత మృతదేహాన్ని కందకంలోకి లాగి పడేశాడు.

గుర్రం తన యజమానికోసం నిశ్శబ్దంగా ఎదురుచూస్తోంది. ఫాదర్ మిలన్ దాని మీదఎక్కి మైదానాలగుండా వేగంగా వెళ్లిపోయాడు.

ఒక గంట తర్వాత అతను పక్కపక్కనే తిరిగి వస్తున్న మరో ఇద్దరు ఉహ్లాన్లను గమనించాడు. అతను నేరుగా వారి వైపు వెళ్ళాడు, మరోసారి 'హెల్ప్! హెల్ప్!' అని అరిచాడు.

ఆ ప్రష్యన్లు యూనిఫామ్‌ను గుర్తించి, ఎలాంటి అనుమానం లేకుండా అతన్ని దగ్గరకు రానిచ్చారు. ఆ వృద్ధుడు వారి మధ్య ఫిరంగి గుండులా దూసుకెళ్లి, ఒకరిని కత్తితో, మరొకరిని రివాల్వర్‌తో కింద పడేశాడు.

ఆ తర్వాత అతను గుర్రాలను చంపేశాడు, జర్మన్ గుర్రాలు! ఆ తర్వాత అతను వేగంగా అడవిలోకి తిరిగి వచ్చి, ఒక గుర్రాన్ని దాచాడు. తన యూనిఫామ్‌ను అక్కడే వదిలేసి, మళ్లీ తన పాత బట్టలు వేసుకున్నాడు; ఆపై ఇంటికి వెళ్లి పడుకుని, ఉదయం వరకు నిద్రపోయాడు.

ఆ విచారణ ముగిసేవరకు అతను నాలుగు రోజుల పాటు బయటకు వెళ్లలేదు; కానీ ఐదవ రోజు మళ్లీ బయటకు వెళ్లి అదే వ్యూహంతో మరో ఇద్దరు సైనికులను చంపాడు. అప్పటి నుండి ఇక అతను ఆగలేదు. ప్రతి రాత్రి సాహసం చేయాలని అనిపించడంతో, ప్రష్యన్లను చంపుతూ, ఒంటరి ప్రదేశాల్లో వెన్నెల్లో, ఒక తప్పిపోయిన ఉహ్లాన్‌లా, మనుషులను వేటాడేవాడిలా వీరవిహారం చేస్తూ తిరిగాడు. ఆ తరువాత, తన పని పూర్తయ్యాక, మృతదేహాలను రోడ్ల వెంబడి వదిలేసి, తిరిగివచ్చి గుర్రాన్ని, యూనిఫామ్‌ని దాచేసేవాడు. మధ్యాహ్నం వేళ ఎవరికీ తెలియకుండా తన గుర్రానికి ఓట్స్, నీరు తీసుకువెళ్లి పెట్టేవాడు; దానితో ఎక్కువ పనిచేయించుకోవాలి కదా మరి. కానీ అంతకు ముందురాత్రి అతను దాడి చేసిన వారిలో ఒకడు, తనను తాను రక్షించుకునే క్రమంలో, ఆ వృద్ధుడిముఖంపై తన కత్తితో కోశాడు.

ఏది ఏమైనా, అతను వారిద్దరినీ చంపేశాడు. తిరిగి వచ్చి గుర్రాన్ని దాచిపెట్టి మళ్లీ తన సాధారణ దుస్తులు వేసు కున్నాడు; కానీ, ఇంటి దాకా వెళ్లలేక ఈడ్చుకుంటూ గాదె వరకు వెళ్లాడు.

వారు అతన్ని అక్కడే, ఆ గడ్డిపై రక్తమోడుతూ కనుగొన్నారు. అతను తన కథను ముగించి, అకస్మాత్తుగా తలఎత్తి ప్రష్యన్ అధికారుల వైపు గర్వంగా చూశాడు. తన మీసాలు కొరుక్కుంటున్న కల్నల్ అడిగాడు: 'నువ్వు చెప్పడానికి ఇంకేమీ లేదా?'

'ఇంకేమీ లేదు; నా పని పూర్తయింది; నేను పదహారు మందిని చంపాను, ఒక్కరు ఎక్కువ కాదు, తక్కువ కాదు.'

'నువ్వు చనిపోబోతున్నావని నీకు తెలుసా?'

'నేను క్షమాభిక్ష అడగలేదు.'

'నువ్వు సైనికుడిగా పనిచేశావా?'

'అవును, నేను వయసులో ఉండగా పనిచేశాను. మొదటి చక్రవర్తి సైనికుడిగాఉన్న నా తండ్రిని మీరే చంపారు. గత నెలలో మీరు నా చిన్నకొడుకు ఫ్రాంకోయిస్‌ని ఎవ్రీక్స్ దగ్గర చంపారు. అందుకు నేను మీకు బాకీపడ్డాను; ఇప్పుడా బాకీ తీరి పోయింది. మన లెక్క సరిపోయింది.'

అధికారులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు.

వృద్ధుడు కొనసాగించాడు: 'నా తండ్రిని చంపినందుకు ప్రతీకారంగా ఎనిమిది మందిని, నా కొడుకును చంపినందుకు బదులుగా ఎనిమిది మందిని...మన లెక్క సరిపోయింది. నేను మీతో ఎలాంటిగొడవకు రాలేదు. మీరు ఎవరో నాకు తెలియదు కూడా. మీరు ఎక్కడినుండి వచ్చారో నాకుతెలియదు. కానీ మీరు ఇక్కడ, నా ఇంట్లో ఉంటూనే, మీ సొంత ఇంటిలో ఉంటున్నట్టు నన్ను ఆజ్ఞాపిస్తున్నారు. నేను నా పగను వాళ్లమీద తీర్చుకున్నాను. నాకేం బాధ లేదు.'

ఆపై వంగిన తన వీపును నిటారుగా నిలబెట్టి, ఆ వృద్ధుడు అణకువ గల వీరుడిలా తన చేతులు



కట్టుకున్నాడు.ప్రష్యన్లు చాలాసేపు నెమ్మదిగా గుసగుసలాడు కున్నారు. వారిలో ఒక కెప్టెన్, గత నెలలో తన కొడుకును కోల్పోయిన వాడు, ఈ పేదవాడిని వెనకేసుకొచ్చాడు.

అప్పుడు కల్నల్ పైకి లేచి, ఫాదర్ మిలోన్ దగ్గరకు వెళ్లి నెమ్మదిగా ఇలా అన్నాడు: 'వినండి, పెద్దాయనా, మీ ప్రాణాలను కాపాడుకోవ డానికి ఇప్పటికీ ఒక మార్గం ఉంది,' ఎలాగంటే...

కానీ ఆ వ్యక్తి వినలేదు; అతని కళ్లు ద్వేషంతో అధికారిని స్థిరంగా చూస్తున్నాయి; గాలి అతని తలపై ఉన్న మృదువైన జుట్టుతో ఆడుకుంటుండగా, కత్తితో కోసిన ముఖాన్ని వంకరగా పెట్టి, భయంకరంగా చూస్తూ, తన ఛాతీని బాగా ఉబ్బించి, కాండ్రించి ఆ ప్రష్యన్ ముఖంపై నేరుగా ఉమ్మేశాడు.

కల్నల్ కోపంతో తన చేయి ఎత్తాడు, ఆ వ్యక్తి రెండవసారి అతని ముఖంపై ఉమ్మాడు.

అధికారులంతా ఉలిక్కిపడి లేచి, ఒకేసారి అరుస్తూ ఆజ్ఞలు జారీ చేశారు.

ఒక్క నిమిషం లోపే, ఆ వృద్ధుడు ఇంకా నిర్లిప్తంగా ఉండగానే, గోడకు ఆనించి కాల్చి చంపారు. భయంతో మూగబోయి, ఇదంతా చూస్తున్న తన పెద్ద కొడుకు జీన్, కోడలు, ఇద్దరు మనవల వైపు నవ్వుతూ చూస్తూ ప్రాణాలు వదిలాడు మిలన్.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# నిశ్శబ్ద త్యాగం

**కత్తిమండ ప్రతాప్ కుమార్**
9000343095

ఆకాశం చిల్లులు పడిందేమో అన్నట్లుగా జోరున కురుస్తున్న వర్షం. కోనసీమలోని ఆ పాత పెంకుటిల్లు తడి మట్టి వాసనను గతకాలపు జ్ఞాపకాలను పులుముకుని నిశ్శబ్దంగా ఉంది. తండ్రి కూర్చునే మడత కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాడు అజయ్. తన తండ్రి చనిపోయి పదిహేను రోజులు అవుతుంది. ఆ ఇంటి మట్టి గోడలకు తండ్రి సూర్యప్రకాశరావు శ్వాస ఇంకా అంటుకునే ఉందేమో అన్న భ్రమ కలుగుతోంది. హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తున్నాడు అజయ్. నాన్న మరణవార్త విని వచ్చాడు. నాన్న జ్ఞాపకాలు మరిచిపోలేకపోతున్నాడు. అమ్మ శోకాన్ని తీర్చలేకపోతున్నాడు. ఆలోచిస్తూ ఉంటే అతని దృష్టి గదిలో మూలన ఉన్న ఇనుప పెట్టె మీద పడింది. దగ్గరకెళ్ళి దాని తాళం తీస్తున్నప్పుడు కలిగిన కీచుమనే శబ్దం అజయ్ గుండెలో ఒక తెలియని గుబులును రేపింది. పెట్టె మూత తెరుచుకోగానే దశాబ్దాల కాలం నాటి నిశ్శబ్దం ఒక్కసారిగా గాలిలోకి పరిమళంలా విరజిమ్మింది. పైన కొన్ని పాత రేషన్ కార్డులు, పసుపు రంగులోకి మారిన కరెంటు బిల్లులు, నాన్న జాగ్రత్తగా దాచుకున్న అజయ్ చిన్ననాటి స్కూలు ప్రోగ్రెస్ రిపోర్టులు ఉన్నాయి. వాటన్నింటి మధ్యన నల్లటి బైండింగ్‌తో, అంచులు అరిగిపోయిన ఒక పాత డైరీ దర్శనమిచ్చింది.

అది సూర్యప్రకాశరావు అంతరంగ ప్రపంచానికి మూసి ఉన్న తలుపు. అజయ్ వణుకుతున్న చేతులతో దానిని తెరిచాడు. మొదటి పేజీలో అది అజయ్ పదో తరగతి ఫలితాలు వచ్చిన రోజు. అజయ్ కళ్ళు పెద్దవి చేశాడు. 'ఈ రోజు అజయ్ గాడు ఫస్ట్ క్లాస్ లో పాసయ్యాడు. వాడు కోరుకున్న హీరో రాయల్ సైకిల్ కొనివ్వాలి. కానీ చేతిలో చిల్లిగవ్వ లేదు. ఆఫీసులో అడ్వాన్స్ అడిగితే కుదరదన్నారు. వాడి కళ్ళల్లో ఆనందం చూడాలంటే నా పాత అట్లాస్ సైకిల్ అమ్మేయక తప్పదు. అది అమ్మితే నేను ఆఫీసుకి రోజూ ఎనిమిది కిలోమీటర్లు నడిచి వెళ్లాలి. పర్వాలేదు.. తండ్రి నడిస్తేనే కదా కొడుకు పరిగెత్తేది? నా కాళ్ల నొప్పులు వాడి కలల కంటే పెద్దవి కావు...' అని చదివిన అజయ్ కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి. ఆ అక్షరాలు కేవలం సిరా చుక్కలు కావు. తన తండ్రి పదిహేనేళ్ల క్రితం చిందించిన రక్తపు చుక్కలని అతనికి అర్థమైంది.

అప్పట్లో నాన్న తన సైకిల్ "దొంగిలించబడింది" అని చెప్పారు. కానీ, అది అబద్ధం అని ఇప్పుడు తెలిసింది. అజయ్ మనసు ముక్కలైంది. ఆ డైరీ పేజీలు తిరగేస్తున్న కొద్దీ అజయ్ గుండె భారం పెరుగుతోంది. పేజీలు తిరగేస్తుంటే నాటి రాతలు అజయ్ ప్రాణాన్ని పిండేశాయి. అది అతను ఇంజనీరింగ్ చదువుతున్న రోజులు.

'అజయ్ కి ఫీజు కట్టడానికి ఇంకా యాభై వేలు తక్కువయ్యాయి. డాక్టర్ గారు మాత్రం ''గుండె ఆపరేషన్ వెంటనే చేయించుకోకపోతే ప్రమాదం. మందులు అస్సలు మానవద్దు`` అని గట్టిగా హెచ్చరించారు. ఆలోచించాను.. నా గుండె కొట్టుకోవడం ఆగిపోయినా పర్వాలేదు కానీ, వాడి చదువు మధ్యలో ఆగిపోకూడదు. ఈ నెల నుంచి మందులు ఆపేస్తున్నాను. ఆ డబ్బుతో వాడి ఫీజు కడతాను. నా ఊపిరి కంటే వాడి డిగ్రీ పట్టా నాకు ఎక్కువ ప్రాణవాయువునిస్తుంది.' అని రాసుకున్న వాక్యాలు అజయ్ చదివి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు.

తండ్రి తన ముందు చిరునవ్వుతో తిరుగుతూ, లోపల గుండె నొప్పితో ఎంత విలవిల్లాడి ఉంటారో? ఊహించుకుంటే అతనికి ఊపిరి ఆగిపోయినంత పని



అయింది. కొన్ని పేజీలు తిప్పాడు. చదవలేకపోతున్నాడు. బయట వర్షం హోరు తగ్గుతోంది. కానీ, అజయ్ కళ్లల్లో వర్షం ఆగడం లేదు. అప్పుడు తండ్రి పాలిపోయిన ముఖంతో ఉండేవారు, ఆయాసపడుతూ నడిచేవారు. 'ఏమైంది నాన్న?' అని అడిగితే, 'వయసు పైబడుతోంది కదరా... ఆ మాత్రం అలసట ఉంటుందిలే' అని నవ్వేసేవారు. ఆ నవ్వు వెనుక ఎంతటి మరణవేదనను ఆయన భరించారో ఇన్నాళ్లకు డైరీ సాక్షిగా బయటపడింది.

'అజయ్ ల్యాప్ టాప్ కావాలని అడిగాడు. డబ్బులు లేవని చెప్పలేను. పార్వతి తన మెడలో ఉన్న గొలుసు తీసి నా చేతిలో పెట్టింది. అది వద్దని చెప్పే ధైర్యం నాకు లేదు. ఎందుకంటే నా దగ్గర వాడి చదువుకు కావాల్సినంత సంపాదన లేదు. నా భార్య నగలను అమ్ముతున్నందుకు మనసు విలవిల్లాడినా, అజయ్ ఇంజనీరింగ్ పట్టా పుచ్చుకుని ఇంటికి వచ్చే రోజు ఆ నగలే కాదు.. ఉద్యోగంలో చేరాక అంతకు మించిన వెలుగు మా ఇంట్లో ఉంటుందని నన్ను నేను ఓదార్చుకున్నాను.'

అజయ్ ఆ వాక్యాలను చదువుతూ వెక్కి వెక్కి ఏడ్చాడు. అప్పుడు తనకు కొత్త ల్యాప్‌టాప్ కావాలని మారం చేసినప్పుడు.. నాన్న మారుమాట్లాడకుండా కొనిచ్చారు. అదంతా అమ్మ మెడలోని గొలుసును తాకట్టు పెట్టి తెచ్చిన సొమ్ము అని అప్పుడు అజయ్‌కి తెలియదు. ఆ ఇంట్లో అమ్మ మెడ ఎప్పుడూ ఖాళీగా ఉండేది కాదు. కానీ ఆ నాలుగేళ్లు అమ్మ కేవలం నల్లపూసల తాడుతోనే సరిపెట్టుకున్న దృశ్యం ఇప్పుడు అజయ్ కళ్లముందు కదలాడింది.

-------

తండ్రి చనిపోవడానికి వారం రోజుల ముందు రాసిన ఆఖరి వాక్యాలు అజయ్ ని నిలువునా కదిలించాయి. అక్షరాలు వణికినట్టు రాసాడు - 'అజయ్.. నీకు ఆస్తులేమీ ఇవ్వలేకపోతున్నాను. నిన్ను ఒక మంచి మనిషిగా తీర్చిదిద్దడమే నేను సంపాదించిన ఏకైక సంపద. నన్ను క్షమించు.' అజయ్ ఆ డైరీని గుండెలకు హత్తుకుని బోరున విలపించాడు. తండ్రి అంటే కేవలం భౌతిక సంపదను లెక్కలు చూసే యంత్రం కాదు. తన ఆయుష్షును కరిగించి, పిల్లల భవిష్యత్తుకు వెలుగునిచ్చే కొవ్వొత్తి అని అతనికి బోధపడింది. వెలుపల వర్షం వెలిసింది. ఆకాశంలో మబ్బులు విడిపోయి ఎండా వస్తోంది. అజయ్ గదిలో ఉన్న అమ్మ దగ్గరకు వెళ్లాడు. అజయ్ చేతిలో డైరీ చూసి ఆమె కళ్లల్లో కూడా కన్నీళ్లు కనిపించాయి. డైరీ గట్టిగా పట్టుకుని ఏడ్చాడు అజయ్.

'చూశావా అజయ్! మీ నాన్న అంటే కేవలం ప్రతీ దానికి లెక్కల ఖర్చుల మాస్టారు అనుకున్నావు. ఆయన నీ కోసం తన ఆరోగ్యాన్ని, ఆఖరికి ఆయుష్షును కూడా ఎలా ఫణంగా పెట్టారో చూశావా?' అంది. అజయ్ తన తండ్రి ఫోటో వైపు చూశాడు. ఆ ఫోటోలోని సూర్యప్రకాశరావు కళ్లల్లో ఒక విధమైన తృప్తి కనిపిస్తోంది. అదే సమయంలో అజయ్ భార్య సుమ, ఇద్దరు పిల్లలు చింటూ, నిత్యలు గదిలోకి వచ్చారు. కన్నీళ్లతో ఉన్న అజయ్‌ని చూసి సుమ కంగారుగా దగ్గరకు వచ్చింది.

అజయ్ ఆ డైరీని సుమకు చూపిస్తూ నాన్న త్యాగాన్ని వివరించాడు. అది విన్న సుమ కళ్లు కూడా చెమర్చాయి.

'మనం నాన్నకు ఏమిచ్చాం సుమా? ఆయన మన కోసం ప్రాణాలే ఫణంగా పెడితే, మనం కేవలం ఒక పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చిందని గర్వపడ్డాం' అన్నాడు అజయ్ ఆవేదనగా. ఆలోచనలో పడ్డాడు అజయ్. ఒక నిర్ణయానికి వచ్చాడు. తన తండ్రి త్యాగానికి అర్థం చేకూరాలంటే కేవలం తను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా డబ్బు సంపాదించడం సరిపోదు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

5వ పేజీ నుంచి

తన ఇద్దరు పిల్లల చేతులు పట్టుకుని నాన్న ఫోటో ముందు నిలబడ్డాడు.

'నాన్నలారా! మీ తాతయ్య మనకి కోట్లు ఇవ్వలేదు. కానీ ఒక గొప్ప వారసత్వాన్ని ఇచ్చారు. ఈ రోజు నుంచి మన సంపాదనలో ఒక భాగం ఈ ఊరిలో చదువుకోవాలనే తపన ఉండి, డబ్బు లేని పేద విద్యార్థుల కోసం వినియోగిద్దాం. ''సూర్యప్రకాశరావు విద్యా నిధి'' ద్వారా వందలాది మంది పేద బిడ్డలను చదివించి, నాన్న ఆశయాన్ని మనం బతికిద్దాం. అదే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి,'' అన్నాడు అజయ్ దృఢంగా. సుమ, అజయ్ భుజంపై చేయి వేసి మద్దతుగా నిలిచింది. పిల్లలు ఇద్దరూ తాతయ్య ఫొటోకు నమస్కరించారు. తండ్రి మడత కుర్చీలో ఇప్పుడు ఒక కొత్త బాధ్యత కూర్చున్నట్టు అనిపించింది. ఆకాశంలో వెలిసిన ఇంద్రధనుస్సులా సూర్యప్రకాశరావు గారి త్యాగం ఇప్పుడు ఎందరో పేద విద్యార్థుల జీవితాల్లో రంగులు నింపడానికి సిద్ధమైంది. నిశ్శబ్దంగా కురిసిన వాన భూమిని తడిపినట్లు.. నాన్న నిశ్శబ్ద త్యాగం ఒక గొప్ప సామాజిక మార్పుకు పునాది వేసింది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



సూర్య

# యుగళం

రేగిన రింగులజుట్టు, ఇంకా నిద్ర వీడని కళ్ళు చుట్టూ ఉన్న పరిసరాలను వింతగా చూస్తూ నడుస్తోంది శారద. ఎక్కడచూసినా జనం... జనం. ఇసుక వేస్తే రాలనంతగా ఉన్నారు. హడావుడిగా, ఒకింత గందరగోళంగా ఒకరి మాటలు ఒకరికి వినిపించనంత రద్దీగా ఉంది స్టేషన్. ఒకటే ఉరుకులు, పరుగులు తీస్తున్నారు.. ఈ హడావుడి లోనే, ఎలాగో వీలు చేసుకుని తండ్రి రెండు రిక్షాలు బేరమాడుతున్నాడు. తల్లి తమ్ముడిని ఒక్క చేత్తో పట్టుకుని, రెండో చేత్తో, సామాను మీద చేయి వేసి నిలుచుంది. బేరం కుదిరింది. రిక్షాలు ఎక్కారు. "ఇదిగో రిక్షా అబ్బి , ఆ ముందు రిక్షా వెనకాలే వెళ్ళు గట్టిగా హెచ్చరించింది" లక్ష్మి, తండ్రి తో పాటు ఎక్కిన, శారద, తనకు తానే ఓ మహారాణి లా గ భావిస్తూ ఠీవిగా కూర్చుంది.

రైల్వే స్టేషన్ దాటి, బయటకు వచ్చేసరికి రోడ్డంతా జనాలతో కిక్కిరిసి పోయింది. నడిచే వాళ్ళని తమ గంట తో అదమాయిస్తూ రిక్షాను ముందుకి తీసుకెళుతున్నారు. పెద్ద స్టేషన్ దాటి ముందుకు వెళుతున్నప్పుడు, కళ్ళు విప్పార్చి, అటూ, ఇటూ చూస్తున్న శారదని పలకరించాడు. "అమ్మా! శారూ, ఇల్లు దొరికేవరకు అత్తయ్య ఇంట్లో ఉండి, ఆ తరువాత మనం కొత్త ఇల్లు తీసుకుని వెళ్ళిపోదాం, ఇక్కడ కొత్త స్కూల్, కొత్త స్నేహితులు తో బావుంటుంది తల్లీ" అంటూ, తన చేతి లో ఉన్న ఆ చేయిని ప్రేమ గా నిమిరాడు. "అలాగే నాన్నా" అంటూ గారాలు పోయింది. "మా బంగారు తల్లి" అని బుగ్గమీద ముద్దు పెట్టుకున్నాడు.

"బాబుగారూ ఇదిగో, ఇదే పుష్కర రేవు, తెల్లారే వచ్చేస్తున్నారు బాబు స్నానాలికి" అంటున్న రిక్షా అబ్బి మాటలు వింటూ ప్రభాకరం ఆ వైపుగా చూసాడు.

అప్పటికే పుష్కరాలు మొదలయి మూడు రోజులయ్యాయి. పైగా ఆదివారం కావటం వల్ల బాగానే రద్దీగా ఉంది అనుకున్నాడు. కొత్త నీరు కూడ చేరటం తో ఎర్రగా ఉ ంది నది. "నాన్నా, అదిగో రైలు బ్రిడ్జి పైన నుంచి వెళుతోంది" ఆనందంగా అరిచింది" "అవునమ్మా మనం కూడా ఇలాగే వచ్చాము".

అలా ఊరు చూస్తూ వెళుతున్న ప్రభాకరం, రిక్షా అతని వైపు కి తిరిగి "అదిగో ఆ గాంధీ బొమ్మ దాటాక వచ్చిన ఎడమవైపు సందు లోకి తిప్పు" అన్నాడు. రెండో రిక్షా కూడ ఆ సందులోకి తిరిగింది. " అబ్బీ ఆ కానుగ చెట్లున్న ఇంటి ముందు ఆపు" ప్రభాకరం అనడం ఏమిటి, రిక్షా లోంచి ఒక్క ఊపున దిగి శారద గేటుకి ఆపక్క ఈ పక్క ఉన్న పెద్ద పెద్ద కానుగ చెట్లును చూస్తూ నిల్చుండిపోయింది. "అమ్మో పెద్ద ఇల్లు అనుకుంది" విప్పారిన కళ్ళతో. "అలా గే ఉండిపోతావా లోపలి రావా," అన్న మాటలకి ఉలిక్కిపడి అటు వైపు గా చూసింది. ఇంచుమించుగా పదకొండు, పన్నెండేళ్ల ఉన్న అబ్బాయి నవ్వుతూ పలకరించాడు. ఇంకా లోపలి నుంచి బిలబిల మని చాల మంది పెద్దా, చిన్నా కూడా వచ్చారు.

ఇంతలో ఒక పెద్దాయన దగ్గరగా వచ్చి "ఏమ్మా! లక్ష్మి కులాసానా? ప్రయాణం బాగా జరిగిందా, రావోయి ప్రభాకరం సామానులు ఆ గది లో పెట్టుకోండి" పలకరిస్తూనే వీధి లోకి వెళ్ళిపోయాడు. "అలాగే మావయ్యగారు" అంటూ చెల్లెలి మావగారి ఆపేక్షకు, ఆదరాభిమానాలకు, మురిసిపోయాడు. ఇంటిని పరిశీలనగా చూస్తున్న శారద ని మేనత్త వచ్చి దగ్గరగా తీసుకుని ముద్దు పెట్టుకుంది. ఆ చర్య తో "ఫో అత్తయ్యా" అంటూ సిగ్గు పడింది

"ఇప్పుడు కాదే పిల్లా సిగ్గు పడటం, రేపోద్దున్న మీ బావను చేసుకున్నాక అప్పుడు" అంటూ మేనత్త, అత్తగారు అనడం, "అంత అదృష్టమా మాకు పిన్నిగారు" అని లక్ష్మి బదులు పలకడం ఒకే సారి జరిగిపోయాయి.

"మొహాలు కడుక్కుని రండి అన్నయ్యా,వదినా కాఫీ కలిపి ఇస్తాను. ఏమే శారదా, నువ్వు తమ్ముడు బోర్నవీటా తాగుదురుగాని అలా పెరట్లోకి వెళ్లి పళ్ళు తోముకుని రండి" అంటూ మేనత్త పురమాయించడం తో తొమ్మిదేళ్ల శారద తూనీగలా పరుగెత్తింది.

ఆ మరునాడు తెల్లవారుఝామున పుష్కర స్నానానికి బయల్దేరారు. ముఖ్యంగా శారదకు భలే సరదా అనిపించింది. మేనత్త, తల్లి, మేనత్త అత్తగారు, కొత్తగా నేస్తం అయిన విస్సుబావ, అనబడే విశ్వనాథం, ఇంకా పుష్కరాల కొచ్చిన చుట్టాలు, అందరూ సంచుల్లో మారు బట్టలు, తువ్వాళ్ళు పెట్టుకుని సుమారు ఓ పదిహేనుమంది ఆడ,మగా, పిల్లల తో సహా నడక సాగించారు.

"అట్టే దూరం లేదు తొందరగా నడవండి,మళ్ళీ జనం వచ్చేస్తే కాలు పెట్టడానికి కూడా స్థలం దొరకదు" మేనత్త మావగారు అందరిని హెచ్చరించాడు.

ఆ మాటలతో అందరూ నడక వేగం పెంచారు.

పుష్కర రేవు దగ్గరకు వచ్చేసరికి అప్పటికే జనాలు ఉన్నారు. జట్లు జట్లు గ వెళ్దామని ముందే అనుకోవడం తో నలుగురు.. నలుగురు చొప్పున వెళ్లారు.

మిగతా వాళ్ళు ఒడ్డున ఉన్న పావంచాల పైన కూర్చొన్నారు.

"ముందు పెద్దవాళ్లు స్నానాలు చేసాక, మనలని ముంచుతారుట,మూడు మునకలు వేస్తె పుణ్యం వస్తుంది ట" అని ఆరిందాలా చెబుతున్న శారదను అలానే చూస్తుండిపోయాడు విశ్వం . "మరే మనిద్దరం జట్టు కదా చేతులు పట్టుకుని ఇద్దరం ఒకే సారి మునుగుదాము, భయం కూడా వెయ్యదు"

అప్పటికే చాల మంది స్నానాలు చేసి దీపాలు విడిచి పెడుతున్నారు. ఆ గోదారి తల్లికి ముత్యాల హారం వేసినట్లు దీపాలు కదిలి వెళుతుంటే వాటిని చూస్తున్న వాళిద్దరి మొహాలు కూడా దీపకాంతులలో వెలిగిపోతున్నాయి.

పెళ్లిపందిరి నిండా జనం, పందిరి చివర సన్నాయి మేళం ,పెళ్ళిపీటల మీద విశ్వం, శారద. "సుముహూర్తం అయింది ఆ తెర తీయండి" అంటున్న పెద్దలు, మంత్రాలు చదువుతున్న పురోహితులు, అగ్ని సాక్షిగా ఇద్దరికీ పెళ్లి అయిపోయింది. ఇద్దరి సంసారం జీవితం యుగళం గా మొదలయింది. కొత్త దంపతులు ఇద్దరూ ఆ సాయంత్రం వేళ షికారుగా గోదావరి బండ్ మీదకు వచ్చారు. విశ్వం జీవితం లో కి కొత్త వెలుగులు తెచ్చింది శారద . అతనికి జీవితం లో ధైర్యంగా ఉండటం, ఏ ఒడిదుడుకులకు కుంగిపోకుండా నిబ్బరంగా ఉండటం నేర్పింది.

ఆమె అంతరింగిక లోతుల్లోకి తరిచి చూడాలని ఎన్ని మార్లో అనుకున్నాడు.

కానీ ఆమె ఒక ధీర! గంభీర అఖండ గోదావరి లోతు కొలవగలమా ! అలాగే శారద మనసుని కూడా !

రెండో పుష్కరం కూడా వెళ్ళింది ..

ఇద్దరూ పిల్ల తల్లి అయింది శారద

అప్పటికి మూడో పుష్కరం కూడా గడచి పోయింది. . అంతవరకూ చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా బాగానే వెళ్ళింది జీవితం.

నాలుగోపుష్కరాల ప్రవేశం లో వారి జీవిత ప్రవాహం సాఫీగా సాగలేదు. అప్పుడే వాళ్ళు ఒక పెద్ద సుడిగుండాన్ని ఎదురుకోవలసి వచ్చింది. . విశ్వం పనిచేసే కంపెనీ మూతపడటంతో, చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి. అప్పుడే పిల్లల పైచదువుల కోసం పెద్ద మొత్తంలో డబ్బు కావాల్సి వచ్చింది. అప్పటివరకు ఎవరినీ చేయి చాచని విశ్వం, ఆత్మాభిమానం చంపుకోలేక, బయట పడలేక కుంగిపోయారు. ఆ నిరాశలో ఆయనకు రక్తపోటు మొదలైంది.

అప్పుడు శారద తనలోని ధీరత్వాన్ని బయటకు తీసింది. "గోదావరికి వరదలు వస్తే ప్రవాహం ఆగిపోతుందా బావా ! పూడిక తీసి చెత్తాచెదారాన్ని ఊడ్చేస్తే , మరింత వేగంగా ముందుకు సాగుతుంది. మన కష్టం కూడా అంతే!" అంటూ అతనికి ధైర్యం చెబుతూ తనకు తానూచెప్పూ చెప్పుకుంది .

తన పెళ్లి నాటి నగలను ఏమాత్రం సంకోచించకుండా తీసి ఆయన చేతిలో పెట్టింది. "ఇవి నా అలంకారం కోసం కాదు, మన పిల్లల భవిష్యత్తు కోసం. మీరు ధైర్యంగా అడుగు వేయండి" అని వెన్నుముకగా నిలిచింది.

కేవలం మాటలతోనే ఆగిపోలేదు శారద. తన చేతివంటకు ఉన్న రుచిని పెట్టుబడిగా పెట్టింది. ఆవకాయలు, పచ్చళ్ళు ,పొడులు వడియాలు, పిండివంటలను శుభ్రంగా, రుచిగా తయారు చేయడం మొదలుపెట్టింది.

మొదట్లో ఇరుగుపొరుగు వారు మెచ్చుకుని ఆర్డర్లు ఇచ్చారు. మెల్లగా అది ఊరంతా తెలిసింది. తెల్లవారుజామునే లేచి, ఇంటి పనంతా ముగించుకుని, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఈ పనులు అలసట లేకుండా చేసేది. ఆ కష్టాన్ని చూసి విశ్వం గారి కళ్ళు చెమర్చేవి. 'నీతో ఇలా చేయిస్తున్నాను' అని ఆయన బాధపడితే.. 'మనం మన కష్టాన్ని అమ్ముకుంటున్నాం తప్ప, గౌరవాన్ని కాదుగా!' అంటూ ఆయనలో ధైర్యం నింపేది."

ఆ ఒడిదుడుకులను ఆమె ఎంత సమర్థవంతంగా ఎదుర్కొందంటే, అంతకు మించి విశ్వం గారికి తన భార్య మీద గౌరవం రెట్టింపైంది. ఆ ఆటుపోట్ల తర్వాతే వారి జీవితంలో మళ్ళీ నిలకడ, ప్రశాంతత చోటు చేసుకున్నాయి. ఆ గండం గట్టెక్కిన తర్వాతే పిల్లలు ప్రయోజకులయ్యారు.

ఐదు పుష్కరం వచ్చేసరికి నడి వయసు దాటేసారు శారద ,విశ్వం లు .పిల్లలిద్దరూ బాగా చదువుకుని యోగ్యులయ్యారు .అప్పటికి సంసారం కాస్త కుదుటపడింది. అదే వాళ్ళిద్దరి కీ కొండంత బలం. రోజులు స్తిమితంగా గడుస్తున్నాయి.

కాల చక్రం లో ఎన్నెన్ని మార్పులు జరిగాయి, కొడుకు కి కూతురు కి కూడా వెంట వెంటనే పెళ్ళిళ్ళు జరిగాయి. ఎవరి సంసారం వాళ్ళు చేసుకుంటూ, తల్లి ని తండ్రి ని చూడటానికి ఏడాది కొసరి వస్తారు,

పాత తరం జ్ఞాపకాలుగా మారి గోడల మీద నుంచి ఆశీర్వదిస్తున్నాయి. మధ్య తరం అటు పాత ఇటూ కొత్త తరానికి వారధిగా నిలిచి ఉన్నాయి. కొత్తతరం రెక్కలు వచ్చి దూర తీరాలు కు ఎగిరిపోయాయి.

వాళ్ళ అవసరాలకి, శారద విశ్వం ఇద్దరూ కూడా ఆరు నెలలు ఉండి వచ్చారు. పరాయి దేశం లో జాగ్రత్తగా, ఓ మాట అనకుండా, పడకుండా.. పిల్లలతో, మనవల తో గడుపు కి వచ్చిన శారద ని చూస్తే విశ్వాని కి ఎప్పుడు అబ్బురమే! సరే! కొన్ని దేహధర్మాలు కూడా ఉంటాయి కదా ! పటుత్వం తగ్గడం తో పాటు రక్తపోటు ,మధు మేహం పొంచి ఉన్న శత్రువుల్లా చుట్టుముట్టాయి ఆమెని కూడా అతను నెమ్మదిగా ఆమె వైపు తిరిగి, తన జేబులోంచి ఒక పాత పట్టు రుమాలు తీశారు. అందులో ఏదో జాగ్రత్తగా చుట్టి ఉంది.

"ఏమిటది?" అన్నట్లు కళ్ళెగురవేసింది.

ఆయన ఆ రుమాలు విప్పారు. అందులో పాత కిలుం పట్టిన ఒక చిన్న ఇత్తడి 'దీపపు ప్రమిద' ఉంది. ఆమె దాన్ని యథాలాపంగా చూసింది. అంతలో మెదడు లో ఏదో కదలిక మళ్ళీ ఒక్కసారి చూసి "..ఇది ....ఇదీ ". అంటున్న.. ఆమెలో .ఏదో జ్ఞాపకపు తెరలు... మసక .. మసక.. . గా

ఆమె ముఖ కవళికలు గమనిస్తున్న అతని లో .. ఆ నాటి ..రోజులు కళ్ళ ముందు తిరుగుతున్నాయి.

గోదావరి తో పాటు గ కాలం కూడా ప్రవహిస్తూనే ఉంటుంది. అయితే ఆ ప్రవాహం ఒడిదుడుకులను తట్టుకుంటూ నీల నీర గంబీరంగా సాగిపోతోంది.. జీవితం కూడా అంతే

ఆ ప్రదోష పు వేళ ఆకాశం రంగుల హరివిల్లులా ఉంది.

హారతి వెలుగులు నదిలో ప్రతిబింబిస్తుండగా...వాళ్ళ కళ్ళలో, మనస్సుల్లో ఆ జీవితపు అనుభవాలు కనిపిస్తున్నాయి.

"గుర్తుందా శారూ? మన మొదటి పుష్కరం అప్పుడు... నువ్వు, నేను కలిసి దీపాలు వదిలాం. అందరి దీపాలు నదిలో కలిసిపోయినా, నీ దీపం మాత్రం ఒడ్డున ఉన్న ఒక రాతి సందులో చిక్కుకుని అలాగే వెలుగుతూ ఉండిపోయింది. మనం స్నానాలు ముగించి పైకి వచ్చేటప్పుడు, ఎవరికీ తెలియకుండా నేను ఆ ప్రమిదను తీసి దాచుకున్నాను. మన బంధానికి సాక్ష్యంగా ఇది నా దగ్గరే ఉంది. ఇన్నాళ్లూ నీకు చెప్పలేదు.

ఎందుకో ఈరోజు మళ్ళీ దీన్ని నీకు కానుకగా ఇవ్వాలనిపించింది.

నీలో ఆ చిన్న నాటి శారద ని చూడాలనిపించింది"

శారద కళ్ళు ఆనందంతో చెమర్చాయి. "మీరు ఇంకా ఆ పాత జ్ఞాపకాన్ని దాచిపెట్టారా!" అంటూ ఆమె ఆ ప్రమిదను అందుకుంది.

అదే సమయంలో,మెట్ల మీద నుంచి ఓకుటుంబం వెళుతోంది .వారిలో ఒక చిన్నారి పాప... రేగిన రింగుల జుట్టుతో, వింతగా చుట్టూ ఉన్న పరిసరాలను చూస్తూ, తండ్రి చేయి పట్టుకుని నడుస్తోంది. ఆ పాప నడకలో ఉన్న ఠీవి, కళ్ళలో ఉన్న ఆ అమాయకత్వం చూస్తుంటే శారదమ్మకు ఒక్కసారిగా ఒళ్లు గగుర్పొడిచింది. అరవై ఐదేళ్ళఏళ్ల క్రితం తండ్రి చేయి పట్టుకుని తను ఇదే రేవుకు వచ్చిన దృశ్యం కళ్ళముందు కదలాడింది.

ఆ పాప తన తండ్రిని ఉద్దేశించి, "నాన్నా! అక్కడ చూడు రైలు బ్రిడ్జి మీద నుంచి వెళ్తోంది!" అని ఆనందంగా కేక వేసింది. ఆ గొంతులో ఉన్న ఉత్సాహం విన్న శారదకు తనను తాను చూసుకున్నట్టు అనిపించింది. ఎవరో తెలియని ఆ చిన్నారిలో తన బాల్యం మళ్ళీ ప్రాణం పోసుకున్నట్లు అనిపించి, ఆమె పెదవులపై ఒక చిరునవ్వు మెరిసింది.

అఖండ గోదావరి పైన ఇప్పుడు నాలుగు బ్రిడ్జిలు ఉన్నాయి.. విద్యుదీపపు కాంతులతో గోదావరి తోపాటు నగరం కూడా మెరిసి పోతోంది

విశ్వం గారు ఆమె భుజం మీద చేయి వేసి, "చూశావా శారూ, కాలం ప్రవహిస్తూనే ఉంటుంది, కానీ ఇలాంటి రూపాల్లో పాత జ్ఞాపకాలు మళ్ళీ, మళ్ళీ మన కళ్ళముందు నిలుస్తూనే ఉంటాయి. గోదావరి తల్లి సాక్షిగా మన కథ ఈ చిన్నారి రూపంలో వచ్చే కొత్త పుష్కరం వైపు సాగిపోతోంది" అన్నారు.

ఇద్దరూ కలిసి ఆ పాత ప్రమిదలో దీపం వెలిగించి గోదావరిలో వదిలారు.

నది నిండా దీపాలు ,ఆకాశ తారలు వెలుగు వర్షం కురిపిస్తున్నట్లు, నీటిలో దీపాలు వెలుగు కాంతులు.చిమ్ముతూ ముందుకు సాగిపోతున్నాయి.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్స్‌అప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# ధీరులైన వారు న్యాయంగా జీవిస్తారు

**నీతి ప్రౌఢ విహారులైన నిపుణుల్ నిందింపనీ మెచ్చనీ**
**ఖ్యాతిం చెందిన సంపదన్ నిలవనీ గాఢంబుగా సాగనీ**
**ఘతంబప్పుడ పొందనీ నియతిమై గానీ యుగాంతంబునన్**
**నీతి శ్లాఘ్య పదంబు దప్పరు గదా నిత్యంబు ధీరోత్తముల్**

నిందించినా, ప్రశంసించినా, సంపదలు వచ్చినా, తొలగిపోయినా, ఆ క్షణంలోనే మరణం వచ్చినా, ఆ మరణమే కల్పాంతంలో వచ్చినా... ధీరులైనవారు న్యాయ మార్గాన్ని అతిక్రమించరు. అన్యాయం వైపు ఒక్క అడుగు కూడా వేయరని భర్తృహరి (ఏనుగు లక్ష్మణ కవి తెలుగులోకి అనువదించిన పద్యం) చెప్తున్నాడు.

ధీరులైనవారు ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా న్యాయమార్గాన్ని దాటరనే విషయాన్ని ఈ పద్యం వివరిస్తోంది. మనం నమ్ముకున్న మంచి మార్గాన్ని అనుసరించి జీవించేవారిని పలువురు పలు రకాలుగా భావించవచ్చు. కొందరు మనం అనుసరించే మార్గం తప్పని నిందించవచ్చు. మరికొందరు మంచి మార్గమని పొగడొచ్చు. అయితే ధీరుడైనవాడు నిందలను ,పొగడ్తలను.. వేటినీ లెక్క చేయడు. తాను నమ్మిన మార్గంలో ప్రయాణిస్తున్నప్పుడు ఒక్కొక్కసారి సంపదలు రావొచ్చు, ఒక్కొక్కసారి ఉన్న సంపదలు పోవచ్చు, ధీరుడైనవాడు ఈ రెండింటినీ లెక్కచేయడు. మంచిచెడులలో ఏది జరిగినా దానిని లెక్కచేయకుండా, తాను నమ్మిన న్యాయమార్గాన్నే త్రికరణశుద్ధిగా అనుసరిస్తాడు. ఒక్క అడుగు కూడా అతిక్రమించడు. వేటినీ లెక్కచేయకుండా తన పనిని తాను చేసుకోవడంలో నిమగ్నమైపోతాడు. ఇటువంటి వారిని స్థితప్రజ్ఞులు అంటారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా మనకు శ్రీరామచంద్రుడు కనిపిస్తాడు.

శ్రీరామునికి పట్టాభిషేకం అని చెప్పినప్పుడు, మరుసటి రోజు అరణ్యవాసానికి వెళ్లాలి అన్నప్పుడు... రెండు సందర్భాలలోనూ రాముడు స్థిరచిత్తంతో తన పని తాను చేసుకున్నాడు. అదేవిధంగా మహాభారతంలో పాండవులు జూదంలో సర్వం కోల్పోయి అరణ్యాలకు వెళ్లవలసిన వచ్చినప్పుడు క్రుంగిపోకుండా, ధైర్యంగా వనవాసం సాగించారు.

**పరీక్షిత్తు మహారాజు కథ తెలిసిందే.**

శాపకారణంగా పరిక్షిత్తు మరో వారం రోజుల్లో మరణిస్తాడని



తెలిసింది. ఆయన ఏమాత్రం కుంగిపోకుండా, ఈ వారం రోజులపాటు ఏవైనా మంచి విషయాలను బోధించమని శుక మహర్షిని కోరాడు. అప్పుడు శుక మహర్షి శ్రీమద్భాగవత గాథను వారం రోజుల పాటు ఏకధాటిగా పరీక్షిత్తుకి బోధించాడు. మరణం తక్షణమే వస్తోందని తెలిసినా పరీక్షిత్తు చెక్కుచెదరని ఆత్మస్థైర్యంతో నిలబడ్డాడు.

**మరో కథ**

దధీచి మహర్షి బ్రహ్మదేవుని మానస పుత్రుడైన అధర్వణ మహర్షి కుమారుడు. ఆయన సరస్వతీ నదీతీరాన ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకుని కఠోర తపస్సులో నిమగ్నమై ఉండేవాడు. తపశ్శక్తి వల్ల ఆయన ఎముకలు వజ్రంలా అత్యంత దృఢంగా మారాయి.

దేవతలకు, దానవులకు జరిగిన యుద్ధంలో వృత్రాసురుడు అనే రాక్షసుడు దేవతలను ఓడించి స్వర్గాన్ని ఆక్రమించాడు. దేవతలు తమను కాపాడమని మహావిష్ణువును ప్రార్థించారు. వృత్రాసురుడిని సాధారణ ఆయుధాలతో చంపడం అసాధ్యమని, దధీచి మహర్షి ఎముకలతో తయారు చేసిన ఆయుధంతో మాత్రమే అది సాధ్యమవుతుందని విష్ణువు చెప్పాడు. దేవతలందరూ పరుగుపరుగున దధీచి మహర్షి ఆశ్రమం చేరుకుని, తమకు వచ్చిన కష్టాన్ని చెప్పుకున్నారు. అందుకు సమాధానంగా దధీచి, 'దేవతలారా! నా వల్ల మీకు ఎటువంటి సాయం కావాలో కోరుకోండి' అని పలికాడు. అందుకు దేవతలంతా ముక్తకంఠంతో, 'మహర్షీ! మీ శరీరాన్ని మీరు దానం చేయాలి' అని కోరారు. 'ఈ శరీరం ఏదో ఒక రోజు నశించేదే, దీనివల్ల లోకానికి మేలు జరుగుతుందంటే అంతకు మించిన ఆనందం ఏముంది' అని దధీచి సంతోషంగా అంగీకరించాడు. తన యోగశక్తితో ధ్యానంలోకి ప్రవేశించి, ప్రాణాలను విడిచిపెట్టాడు. అప్పుడు విశ్వకర్మ ఆ మహర్షి వెన్నెముకతో శక్తివంతమైన వజ్రాయుధాన్ని తయారు చేశాడు. ఆ వజ్రాయుధంతో ఇంద్రుడు వృత్రాసురుడిని సంహరించి, ఇంద్ర లోకాన్ని రక్షించాడు. దధీచి మహర్షి తనకు వెంటనే మరణం సంభవిస్తోందని తెలిసినా, చిరునవ్వుతో తన శరీరాన్ని సమర్పించాడు. ధీరులైనవారు అంత ఆత్మవిశ్వాసంతో ఉంటారనడానికి ఈ మహర్షి జీవితం చక్కటి ఉదాహరణ.

సోక్రటీసు ఒక గ్రీకు తత్త్వవేత్త. అతని పరిశోధలను గ్రీకు ఛాందసులు తిరస్కరించారు. అంతేకాదు. సోక్రటీసును జైలులో ఉంచారు. అంతటితో ఆగక మరణశిక్ష విధించారు. మరణశిక్షకు ఒక గంట ముందు కూడా అతను సంగీతంలో ఒక కొత్త రాగం నేర్చుకున్నాడట. పక్కనే ఉన్న కొందరు, 'మరొక గంటలో చనిపోతావు, ఇప్పుడు సంగీతం నేర్చుకుని ఏం లాభం' అని ప్రశ్నించారట. అందుకు సమాధానంగా, 'చనిపోయే ముందైనా నేర్చుకునే అవకాశం దొరికింది కనుక, నేర్చుకుని చనిపోతాను' అని సమాధానమిచ్చాడట.

ధీరులైనవారిలో ఉండే గొప్ప లక్షణం ఇదే.

- డా. పురాణపండ వైజయంతి

వెలుగు దినపత్రిక

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# విజ్ఞత

P.L.N. మంగారత్నం
9701426788



ఆ ఉదయం .. వంటకి అమ్మకి కూరగాయలు కోసిచ్చి, సెల్ అందుకుంది వినీత. గత కొద్ది రోజులుగా అదే కాలక్షేపం. సెల్ చేతిలో ఉంటే.. ప్రపంచం అరచేతిలో ఉన్నట్లే అనుకుంది. అయితే, ఈ పని అమ్మకి నచ్చదు. చూస్తే చాలు విసుక్కుంటుంది. 'ఎందుకు? అస్తమానమూ ఆ సెల్లు. ఈ సెలవుల్లో ఏ కుట్లో, అల్లికలో నేర్చుకోవచ్చు కదా! కాలక్షేపం అవుతుంది. పోనీ వంట నేర్చుకుంటావా? అంటే, అదీ లేదు. పెళ్ళయితే ఎలాగే? ఆ పరీక్షల రిజల్ట్స్ ఎప్పుడొస్తాయో! గానీ, నీకు మరో వ్యాపకం లేకుండా పోయింది' అంటూ విసుక్కుంది రామేశ్వరి.

ఆ మాటతో తనకూ గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయని అమ్మకేం తెలుసు. ఆ రోజూ ఎంతో దూరంలో లేదు. అందుకే, రోజులు గడుస్తున్న కొద్దీ ఏదో తెలియని అలజడి. స్థిమితంగా కూర్చోలేకపోతుంది. ఫిజిక్సు పేపరు కష్టంగా వచ్చింది. ఇంగ్లీషూ సరిగ్గా రాయలేదు. అలా ఆలోచిస్తుండగానే స్నేహితురాలు పూజిత నుంచి ఫోను వచ్చింది. ముగ్గుళ్ళ గ్రామం నుంచి మండల హెడ్ క్వార్టరు సీతానగరంకు సైకిళ్ళ మీద వెళ్లి, ఇంటర్మీడియట్ చదువుకునే అమ్మాయిలు వాళ్ళిద్దరే.

'టీ.వీ చూసావా? ఈ రోజు' అంటూ పూజిత ఆతృతగా అడిగింది.

'లేదు.. ఏం?' అడిగింది ఆశ్చర్యంగా.

'రేపు మధ్యాహ్నం మన రిజల్ట్స్ విడుదల చేస్తారంట. ఏం జరుగుతుందో! ఏమో! నాకైతే చాలా భయంగా ఉంది' చెప్పింది.

'అమ్మో! నాకూ అంతే' అంది వినీత అంతే భయంగా.

• • •

భయపడినట్లుగానే వినీత ఫెయిలు అయితే, పూజిత పాస్ అయ్యింది. తను ఫెయిల్ అయినదానికన్నా పూజిత పాస్ అవడం ఎక్కువ బాధ కలిగించింది వినీతకి.

'తండ్రి చిన్నప్పుడే పోతే, తల్లి కష్టపడి చదివిస్తుంటే చదువుకోవడానికి.. ఏం బాధో!' పక్కన ఇంట్లో ఉండే పిన్ని మరెవరితోనే అనడం వినీతకు మింగుడు పడలేదు.

'ఇక నీకు పెళ్లి చెయ్యడమే మిగిలింది. అందాకా ఆ పోయిన పరీక్ష ఏదో కట్టు. వచ్చినవాళ్ళకి, అమ్మాయి ఇంటరు పాసు అయ్యింది అని అయినా చెప్పుకోవాలి కదా!' అంటూ చిన్నగా కేకలేసింది. ఈ రోజుల్లో పిల్లల్ని ఏమనకూడదన్నట్లు .. అయినా వినీత చిన్నబోయింది. ముభావంగా ఉండిపోయింది. ఇప్పుడు పూజిత ఇంజనీరింగులో జాయినయి పోతే, తన ముందే రోజూ కాలేజీకి వెళ్లి వస్తుంటే.. ఊహించు కోలేకపోయింది వినీత.

• • •

రెండు రోజుల తర్వాత ఉదయం పదకొండున్నర సమయానికి బయటకి వెళ్ళడానికి తయారవుతున్న కూతుర్ని ప్రశ్నార్థకంగా చూస్తున్న తల్లికి 'పూజిత వాళ్ళ ఇంటికి' అని చెప్పింది.

'తొందరగా వచ్చెయ్యి' పుత్తడి బొమ్మలా తయారయిన కూతుర్ని చూస్తూ అంది.

'లేదు. సాయంత్రం సినిమాకి అనుకున్నాం' అంది చెప్పులేసుకుని బయలుదేరుతూ. కూతురు బాధ నుంచీ తెరుకోవడమే కావలసిందని తల్లి మనసులో అనుకుంది.

• • •

ఆ రాత్రి పది గంటలు దాటినా కూతురు ఇంటికి రాకపోతే .. స్నేహితురాలి ఇంట్లో ఉండిపోయిందేమో! అనుకుంది. అప్పుడప్పుడూ అలాగే ఉండిపోతుంది. పూజిత వాళ్ళ ఇల్లు ఊరికి చివరగా పొలాల్లోకి ఉంటుంది. రాత్రి పూట ఒక్కతీ రాలేక ఉండిపోయి ఉండవచ్చని సరిపెట్టుకుంది. ఇంట్లో ఉన్న ఒక్క ఫోనూ కూతురి దగ్గరే ఉంటుంది. తెల్లవారిపోయినా వినీత ఇంటికి రాక పోయేసరికి .. ఎదురింట్లో ఉండే వాసుని పంపింది రామేశ్వరి. 'అక్కని తీసుకు రారా..' అని.

వెళ్ళిన పది నిముషాలకే పరిగెత్తుకుంటూ వచ్చాడు వాసు.

'అక్క నిన్న వాళ్ళ ఇంటికి వెళ్ళలేదట పెద్దమ్మా!.' చెప్పాడు ఆయాసంతో. దాంతో గుండెల్లో .. రాయి పడింది రామేశ్వరికి. కనిపించిన అందరినీ అడిగింది.

'నిన్న బస్సులు ఆగే చోట చూసాను. ఎప్పటిలా కాలేజీకి వెళుతుందేమో! అనుకున్నా' చెప్పాడు ఒకతను.

'ఇంకా ఆలస్యం చేస్తే మంచిదికాదు. వెంటనే పోలీసు కంప్లైంట్ ఇవ్వాలి' అన్నారు లోకజ్ఞానం తెలిసినవాళ్ళు. అలాగే ఇచ్చింది రామేశ్వరి. విషయం అంతా విన్న స్టేషన్ హౌస్ ఆఫీసరు విశ్వనాథరావు, వాళ్ళ దగ్గర ఉన్న సాంకేతికతతో ఆమె ఫోన్ నెంబరును ట్రాక్ చేశారు. ఆ నెంబరు .. రామచంద్రాపురం మండలంలోని, వంగలపూడి గ్రామంలో ఉన్నట్లు చూపించింది. అక్కడికి ఆ ప్రదేశం అరవై కిలోమీటర్ల దూరంలో ఉంది. అదే విషయం రామేశ్వరికి వివరించి ..

క్షణం ఆలస్యం చెయ్యకుండా తన సిబ్బందితో బయలుదేరారు విశ్వనాథరావు. రెండు గంటల్లో చేరుకున్నారు అక్కడికి.

వాళ్ళు వెళ్లేసరికి .. ఏటిగట్టుకి దగ్గరలో.. ఉన్న పంటపొలాల్లో ఓ చెట్టు కింద ఒంటరిగా నిలబడి ఉంది వినీత. పోలీసులు ప్రశ్నించడంతో ..

మొదట బిత్తరపోయి, బుకాయించినా అమ్మ పేరు చెప్పడంతో ..

'చచ్చిపోవాలనే.. ఊరి నుండి దొరికిన బస్సు ఎక్కి వచ్చేశాను. ఎవరికీ ఆచూకీ తెలియకుండా ఉండడం కోసం అన్నట్లు. వచ్చిన తర్వాత ఎలా చావాలో తెలీలేదు.. అలాగే ఇంటికి వెళ్ళలేక అవస్థపడుతున్నాను' అంటూ చెప్పి కన్నీళ్ళు పెట్టుకుంది.

'పరీక్ష పోతే.. పట్టుదలగా చదివి.. సప్లిమెంట్ రాయొచ్చు కదా!. ఫోను చూస్తూ సమయం వృథా చేయకుండా చదివితే.. నీ స్నేహితులు పాస్ అయినట్లు నీవు పాస్ అయ్యేదానివి. అందరిలాగే మీరు కూడా రెగ్యులర్ విద్యార్థుల్లాగా పై కోర్సుకి వెళ్లి చదువుకోవచ్చు. అంతేగానీ.. అర్ధాంతరంగా ప్రాణాలు తీసుకుంటే ఏమొస్తుంది? కనీ, పెంచిన వాళ్ళకి గుండె కోత తప్ప. నీకు తండ్రి లేదని అంటున్నావు .. ఇలా చెయ్యొచ్చా!?' అంటూ మందలించి కౌన్సెలింగు ఇచ్చాడు.

అప్పటికి తన తప్పు తెలిసివచ్చి, వినీత కన్నీటి పర్యంతమయ్యింది. ఎంతసేపూ తను పరీక్ష ఫెయిల్ అయ్యింది. తనకు అవమానం జరిగింది. బయటివాళ్ళు ఏమనుకుంటారు? అనుకుందే గాని, తన గురించి ఆలోచించే తల్లిని గురించి పట్టించుకోలేదు. వెంటనే పోలీసులతో ఇంటికి చేరింది. తల్లిని పట్టుకొని ఏడ్చింది. రాజేశ్వరికి కూతుర్ని అప్పజెప్పి పోలీసులు వెళ్లిపోయారు. ఆకలితో ఉన్న వినీతకి అన్నం తినిపించింది తల్లి. వెంటనే తన గదిలోకి వెళ్లి.. ఫిజిక్స్ పుస్తకం తీసి చదవసాగింది. అది చూసి రామేశ్వరి తన కూతురులో మార్పు వచ్చి, విజ్ఞతతో చదువుకుంటుందని సంతోషించింది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సాప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# మంత్రి పదవి..!



పల్లవ రాజ్యాన్ని జయంతుడు పాలించేవాడు. ప్రస్తుతం ఉన్న మంత్రికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆయన స్థానంలో కొత్త మంత్రిని నియమించాలని చాటింపు వేయించాడు. సుమారు పాతిక మంది పోటీలో పాల్గొన్నారు. చివరకు విజయుడు, ప్రభాకరుడు, కేశవుడు అనే వారు మిగిలారు. వారితో "మీకు చివరగా ఒక పరీక్ష పెడుతున్నాను. కృష్ణాపురం, రామాపురం, సీతాపురం గ్రామాలలో కొన్ని సమస్యలున్నాయి.. మీరు ఆ గ్రామాలలో తిరిగి సమస్యల నివారణ ఎలాగో తెలపాలి.. మీకు మూడు రోజుల సమయం ఇస్తున్నాను" అని చెప్పాడు రాజు.

"అలాగే మహారాజా!" అని ఆ ముగ్గురూ ఆ గ్రామాలకు చేరుకున్నారు. వారిలో ప్రభాకరుడు, కేశవుడు ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుని రెండు రోజులకే కోటకు చేరుకున్నారు. "మహారాజా! కృష్ణాపురంలో అంటువ్యాధులు, రామాపురంలో నీటి కొరత, సీతాపురంలో ఆహార కొరత ఉన్నాయి. అంటువ్యాధుల నివారణకు మెరుగైన వైద్యం అందించాలి. నీటి కొరతకు కొత్త బావులు తవ్వించాలి. ఆహార కొరత తీర్చడానికి ధాన్యం అందించాలి అని ప్రభాకరుడు, కేశవుడు ఒకే విధమైన సూచనలు చేశారు.

మూడు రోజుల తరవాత విజయుడు కోటకు వచ్చి రాజు గారిని కలిశాడు. "మహారాజా! కృష్ణాపురంలో అంటు వ్యాధులకు కారణం వీధుల్లో శుభ్రత లేకపోవడంతోపాటు ఇళ్ల ముందు మురికి నీరు నిలవడం కారణాలు. వీధులను శుభ్రంగా ఉంచి మురికి నీరు పోవడానికి కాలువలు తవ్వించాలి. వ్యాధిన పడినవారికి వెంటనే వైద్యం అందించి ప్రతి ఇంటి బయట ఎండిన వేప ఆకుల పొడిని జల్లితే అంటు వ్యాధులు శోకవు.

రామాపురంలో సుమారుగా ఐదు మంచి నీటి చెరువులు ఉన్నాయి వాటిలో పూడిక తీయించాలి.. వచ్చేది వర్షాకాలం కాబట్టి నీటి సమస్య తీరవచ్చు.

అలాగే సీతాపురంలో గత ఏడాది విత్తనాల కొరత వల్ల వ్యవసాయం సరిగ్గా సాగలేదు. అందువల్ల ఆహార ధాన్యం కొరత ఏర్పడింది. కోట నుండి ప్రతి ఇంటికి ఆహార ధాన్యం అందించి. వర్షాలు కురిశాక వ్యవసాయం కోసం రైతులకు మంచి రకం విత్తనాలు అందిస్తే సమస్య తీరిపోతుంది" అని చక్కని సూచనలు చేశాడు విజయుడు. "కొట్టి, కట్టి, తెచ్చె అన్న విధంగా ప్రభకరుడూ, కేశవుడూ గ్రామాల విషయంలో ప్రవర్తించారు. విజయుడు పూర్తిగా మూడు రోజుల సమయం వినియోగించుకుని, ఆ మూడు గ్రామాలలో నివసించే ప్రజల సమస్యలను తెలుసుకోవడమే కాకుండా నివారణ ఎలాగో చక్కగా సూచించాడు.. అందువల్ల మంత్రి పదవి విజయుడినే వరించింది" అని అన్నాడు రాజు. మంత్రి పదవి దక్కినందుకు విజయుడు మహారాజుకు కృతజ్ఞతలు చెప్పాడు.

- యు. విజయశేఖర రెడ్డి

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



SUNDAY
విశాలాంధ్ర
ఆదివారం అనుబంధం
8 | 13 ఆదివారం, సెప్టెంబరు 2026

మన గొప్ప కీర్తి పరాజయాన్ని పొందకుండా ఉండడంలో లేదు. కాని ప్రతి పరాజయం తర్వాత మళ్లీ ప్రయత్నించడం లోనే ఉంది. ☛ కన్‌ఫ్యూజియస్








# కథ దీపం

అనగనగా నాగపూర్ అనే గ్రామంలో భాను అని 12 సంవత్సరాల అమ్మాయి ఉండేది. భానుకు బాగా చదవాలని పెద్ద డాక్టర్ కావాలని ఆశ. కానీ వాళ్ల ఇంట్లో కరెంట్ ఉండేది కాదు. సాయంత్రం ఆరు దాటితే అంతా చీకటే.

నాన్న రోజూ కూలి పని చేసేవాడు. వచ్చే డబ్బుతో ఇల్లు గడవడమే కష్టం. లాంతరు కోసం కిరోసిన్ కొనడానికి కూడా డబ్బులు సరిపోయేవి కావు. భాను రోజూ వీధి దీపం కింద కూర్చొని చదువుకునేది. దోమలు కుట్టినా, చలివేసినా లెక్కచేయకుండా పుస్తకాలు తెరిచేది. ఊర్లో వాళ్లు ఇంత కష్టపడి ఏం లాభం. ఏం సాధిస్తావు నువ్వు ఆడపిల్లవు కదా అనేవాళ్లు. భాను నవ్వి ఊరుకునేది.

ఒకరోజు స్కూల్లో సైన్స్ ఫెయిర్ పెట్టారు. విద్యుత్ లేని ఇళ్లకు ఉపయోగపడే చిన్న పరికరం చేయాలని టీచర్ చెప్పారు. అందరూ బ్యాటరీ లైట్, సోలార్ లాంతర్లు తీసుకొచ్చారు. భాను దగ్గర ఏమీ లేదు.

ఆ రాత్రి చాలా సేపు ఆలోచించింది. ఇంట్లో ఉన్న ఖాళీ ప్లాస్టిక్ బాటిల్, కొంచెం నీళ్లు, ఒక చిన్న టార్చ్‌లైట్ తీసుకుంది. నీళ్ల బాటిల్ ముందు టార్చ్ పెడితే వెలుగు నాలుగు రెట్లు ఎక్కువ అవుతుందని పేపర్లో చదివింది. అదే సందేశంతో ఒక వాటర్‌బాటిల్ లైట్ చేసింది.

మరుసటి రోజు సైన్స్ ఫెయిర్‌లో అందరి ప్రాజెక్టుల కంటే భాను చేసింది చాలా సింపుల్‌గా, ఆకర్షణీయంగా ఉంది. టీచర్స్ భాను ప్రాజెక్టు చూసి ఆశ్చర్యపోయారు. కరెంట్ లేకుండా, ఖర్చు లేకుండా అంత మంచి ఆలోచనని మెచ్చుకున్నారు.

జిల్లా స్థాయి పోటీలకు భాను సెలెక్ట్ అయింది. అక్కడ ప్రథమ బహుమతి 2000 రూపాయలు వచ్చింది. భాను ఆ డబ్బులతో ముందుగా ఇంటికి ఒక చిన్న సోలార్ లైట్ తీసుకుని, మిగిలిన డబ్బులతో ఊర్లో కరెంట్ లేని పది ఇండ్లకు వాటర్ బాటిల్ లైట్స్ చేసి ఇచ్చింది.

కొన్ని సంవత్సరాల తర్వాత భాను నిజంగా డాక్టర్ అయింది. ఊరికి తిరిగి వచ్చి, ఒక చిన్న క్లినిక్ పెట్టింది. ఆ క్లినిక్ పేరు దీపం అని పెట్టడం జరిగింది.

ఒకరోజు ఒక చిన్న పాప భాను దగ్గరకు వచ్చి అక్క రాత్రి చదువుకోవడానికి లైట్ లేదు అని అడిగింది. భాను నవ్వి తన చేతిలో ఉన్న టార్చ్, ఒక వాటర్ బాటిల్ ఆ పాపకు ఇచ్చింది. చీకటి లేకపోతే భయపడకు. నువ్వే ఒక దీపం అవ్వమని చెప్పింది.



నీతి: చిన్న ఆలోచన పెద్ద వెలుగుని తీసుకురాగలదు.

మధుప్రియ, తొమ్మిదవ తరగతి, 9666063963
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హవేళి ఘణపూర్, మెదక్ జిల్లా

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# బుడత



## బాలల కథ

## దుర్వినియోగం

తెల్లవారుజామునే చిరుగాలిని ఆస్వాదిస్తూ, తాతయ్య సంజీవయ్య తన మనుమడు కౌశల్‌ను వెంటబెట్టుకుని పొలానికి బయలుదేరాడు. పచ్చని పైర్లు, పక్షుల కిలకిలరావాల మధ్య సాగుతున్న ఆ ప్రయాణం కౌశల్‌కు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. వారు ఊరి వీధి గుండా నడుస్తుండగా రాజవ్వ ఇంటి ముందు పెద్దగా మాటలు వినిపించాయి. రాజవ్వ తన భర్త రంగయ్యను నిలదీస్తూ, "ఆ ఆకతాయికి అంత డబ్బు చేతికి ఇచ్చావే, వాడు దాన్ని జల్సాలకు తగలేశాడు. నువ్వు చేసిన సాయం కాస్తా 'ఏటిలో కలిపిన చింతపండు'లా అయిపోయింది" అంది. ఆ వింత మాటను విన్న కౌశల్ అయోమయానికి గురయ్యాడు. కొంత దూరం వెళ్లాక, మధురమ్మ తన కొడుకును విసుక్కుంటూ కనిపించింది. "నీకు ఎన్నిసార్లు చెప్పినా నీ బుద్ధి మారడం లేదు. నిన్ను ప్రయోజకుడిని చేయాలని నేను పడుతున్న తాపత్రయం అంతా 'ఏటిలో కలిపిన చింతపండు' చందాన తయారైంది" అని ఆమె అంటుండగా కౌశల్ విని ఆశ్చర్యపోయాడు. రెండు చోట్లా ఒకే జాతీయం వినిపించడంతో అసలు ఏటిలో చింతపండు కలపడం ఏమిటి? దాని వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి? అని తాతయ్యను అడగాలని ఆతృతగా ఎదురుచూశాడు. పొలానికి చేరుకున్నాక, అక్కడ ఉన్న వేపచెట్టు నీడలో తాతయ్య, మనుమడు సేదతీరారు. కౌశల్ తన సందేహాన్ని తాతయ్య ముందు ఉంచాడు. తాతయ్య చిరునవ్వుతో, "కౌశల్, మనం ఇంట్లో పప్పుచారు వండుకున్నప్పుడు చింతపండు వేస్తే అది వంటకు రుచిని, చిక్కదనాన్ని ఇస్తుంది. అదే చింతపండును ప్రవహించే ఏటి నీళ్లలో కలిపితే ఏమవుతుంది? ఆ నీటి ప్రవాహంలో అది కలిసిపోయి మాయమైపోతుంది. అటు ఏటి నీళ్లు పుల్లబడవు, ఇటు చింతపండు తిరిగి దొరకదు. అంటే,



మనం చేసే ఏ పని వల్లనైతే ఎటువంటి ఫలితం ఉండదో, ఏ శ్రమనైతే వృథాగా పోతుందని భావిస్తామో, దానినే 'ఏటిలో కలిపిన చింతపండు' అని అంటారు" అని వివరించాడు.

తాతయ్య మాటల్లోని లోతును కౌశల్ బాగా అర్థం చేసుకున్నాడు. "రాజవ్వ భర్త చేసిన సాయం దుర్వినియోగం అయ్యింది, అలాగే మధురమ్మ తన కొడుకు కోసం పడ్డ శ్రమ నిష్ఫలం అయ్యింది. అందుకే వారు ఆ మాటను ఉపయోగించారు" అని తాతయ్య స్పష్టం చేశాడు. ఏదైనా వస్తువును గానీ, సమయాన్ని గానీ, శ్రమను గానీ సరైన పద్ధతిలో వాడకపోతే అది వృథా అవుతుందని, మనం చేసే ప్రతి పని అర్థవంతమైన ఫలితాన్ని ఇచ్చేలా చూసుకోవాలని కౌశల్ గ్రహించాడు. ఇకపై తన చదువును, కాలాన్ని ఎప్పుడూ వృథా చేయనని, ప్రతి పనిలోనూ శ్రద్ధ పుతానని కౌశల్ తాతయ్యకు మాట ఇచ్చాడు.

**డా.పోతగాని సత్యనారాయణ , 9182531202**

